E KABURU - Digital News Paper

E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 25-03-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక:82 || పేజీలు–6

www.ekaburu.com



# ఐనా.. ఆగని దాడులు!

- ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర బాంబుల వర్షం కనిపించని ట్రంప్ 'యుద్ధ విరామ'ప్రభావం
- రెండు ఇంధన వ్యవస్థలకు భారీ నష్టం: ఇరాన్
- బాంబుల మోతతో దద్దరిల్లిపోయిన టెహ్రాన్
- టెల్ అవీవ్‌పై భారీ దాడులకు దిగిన ఇరాన్
- బహ్రెయిన్‌పై డ్రోన్ దాడుల్లో సైనికుని మృతి
- యూఏఈలో ఒక కాంట్రాక్టర్ మరణం
- గంటల తరబడి చీకట్లో మగ్గిన కువైట్

**ఈ-కబురు, దుబాయ్**

: పశ్చిమాసియాలో యుద్ధానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఐదు రోజుల విరామం ప్రకటించినా మిత్ర దేశం ఇజ్రాయెల్ మాత్రం వెనక్కు తగ్గడం లేదు. మంగళవారం కూడా ఇరాన్‌పై పెద్ద ఎత్తున దాడులతో విరుచుకుపడింది. ఇరాన్ కూడా దీటుగా ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ప్రతి దాడులకు దిగింది. అంతేగాక 'పూర్తి విజయం'సాధించేదాకా పోరాడుతూనే ఉంటామంటూ ఇరాన్ సైన్యం కుండబద్దలు కొట్టింది! దీనికితోడు అమెరికా కూడా వేలాదిమంది మెరైన్ సైనికులను గల్ఫ్‌కు పంపిస్తోంది. దాంతో పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఇప్పట్లో సమసిపోయే పరిస్థితులు కన్పించడం లేదు.దీనికి తోడు ట్రంప్ పేర్కొన్న చర్చలు మంగళవారం ఏ మేరకు పురోగతి సాధించాలన్న దానిపై కూడా పెద్దగా స్పష్టత లేకుండా పోయింది. అయితే ఈ విషయమై ప్రస్తుతానికి అమెరికా, ఇరాన్ నడుమ విశ్వాస కల్పన చర్యలు కొనసాగుతున్నట్టు ఈజిప్ట్ వెల్లడించింది. యుద్ధానికి తెరదించే దిశగా ఇరాన్‌తో రెండు రోజులకు పైగా కీలక చర్చలు జరుగుతున్నట్టు ట్రంప్ సోమవారం ప్రకటించడం తెలిసిందే.

మిగతా2లో

# ప్రతిపక్షమంటే ప్రభుత్వానికి లెక్క లేదు

## హరీశ్‌రావు ధ్వజం , శాసనసభ, మండలి నుంచి భారాస వాకౌట్



ఈకబురు, హైదరాబాద్: శాసనసభ, మండలిలో సమయపాలన పాటించడం లేదని.. గవర్నర్ ప్రసంగంపై మాట్లాడేందుకు అవకాశమివ్వలేదని పేర్కొంటూ భారాస మంగళవారం వాకౌట్ చేసింది. మంగళవారం టీ విరామం అనంతరం శాసనసభలో భారాస డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ టి.హరీశ్‌రావు మాట్లాడుతూ "పర్యాటకం, స్పోర్ట్స్, మైనార్టీ సంక్షేమం పద్దులు పెట్టలేదు. కనీసం చదివేందుకు అవకాశం ఇవ్వడం లేదు. రోజూ ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కావడం కాలేదు. టీబ్రేక్ 10 నిమిషాలు అని చెప్పి గంటల తరబడి వాయిదా వేసి, బెల్ కొట్టడం లేదు. పద్దుల పుస్తకాలు ఇవ్వనందుకు, గంటల తరబడి వాయిదా వేసినందుకు, గవర్నర్ ప్రసంగంపై అవకాశమివ్వనందుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు. అనంతరం వెలుపల ఆయన మీడియాతో ఆయన మాట్లాడుతూ.. "ప్రధాన ప్రతిపక్షమంటే ఈ ప్రభుత్వానికి కనీస మర్యాద, గౌరవం లేదు. శాసనసభను ప్రభుత్వం నిర్వహిస్తున్న తీరుకు నిరసనగా ఉప ముఖ్యమంత్రి సమాధానాన్ని వినకుండా వాకౌట్ చేశాం. ఈ ప్రభుత్వానికి సభా సంప్రదాయాలు తెలియవు. 15 నిమిషాలు టీ బ్రేక్ అని సభను వాయిదా వేస్తూ..

మిగతా3లో

# మతం మారితే ఎస్సీ హోదా కోల్పోయినట్లే!




- హిందూ, సిక్కు, బౌద్ధం మినహా ఇతర మతాలకు మారితే ఎస్సీ రిజర్వేషన్ వర్తించదు
- క్రైస్తవాన్ని స్వీకరించిన వారు దళిత హోదాను పొందలేరు
- ఎస్సీ, ఎస్టీ ఆకృత్యాల నిరోధక చట్టం కింద వారికి రక్షణ లభించదు
- ఏపీ హైకోర్టు తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు స్పష్టీకరణ

**ఈ-కబురు, న్యూఢిల్లీ:**

హిందూ, బౌద్ధం, సిక్కు మతాలు మినహా ఇతర మతాల్లోకి మారిన వ్యక్తులు తమ షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) హోదాను తక్షణమే కోల్పోతారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. క్రైస్తవ మతాన్ని స్వీకరించి, ఆచరిస్తున్న వ్యక్తులు దళిత హోదాను క్లెయిమ్ చేయలేరని, అలాగే తమకు రక్షణ కల్పించాలంటూ 'ఎస్సీ, ఎస్టీ ఆకృత్యాల నిరోధక చట్టాన్ని' (అట్రాసిటీ చట్టం) ఏమాత్రం ఆశ్రయించలేరని తేల్చిచెప్పింది.

ఏపీలోని పిట్టలవానిపాలెం గ్రామంలో హిందూ మతం నుంచి క్రైస్తవంలోకి మారి పాస్టర్‌గా కొనసాగుతున్న చింతాడ ఆనంద్ అనే వ్యక్తి తనపై దాడి జరిగిందని ఆరోపిస్తూ పలువురిపై పెట్టిన అట్రాసిటీ కేసును కొట్టేస్తూ ఏపీ హైకోర్టు గతేడాది ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తాజాగా సమర్థించింది. ఏపీ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ చింతాడ ఆనంద్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

కేవలం ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాన్ని అధికారులు రద్దు చేయనంత మాత్రాన.. మతం మారిన వాస్తవాన్ని విస్మరించలేమని, అతనికి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందే అర్హత రాదని తేల్చిచెప్పింది. 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వులను ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఉదహరించింది. 'ఈ కేసులో పిటిషనర్ తిరిగి తన మాతృ మతంలోకి (హిందూ) మారినట్లు గానీ, మాదిగ సామాజికవర్గం అతన్ని తిరిగి తమలోకి చేర్చుకున్నట్లు గానీ ఎటువంటి ఆధారాలు లేవు.

మిగతా2లో



3

## హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం

.కొన్ని చోట్ల ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన

**ఈ-కబురు,హైదరాబాద్:**

మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీ వర్షం కురిసింది. కొన్ని చోట్ల ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన కూడా పడింది.



3

## రాష్ట్ర బడ్జెట్ ఓ ఎండమావి

ప్రభుత్వంపై ఏలేటి విసుర్లు

ఈ-కబురు, హైదరాబాద్: ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను భాజపా శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎండమావితో పోల్చారు. ఎండమావిలో నీళ్లు ఉండనట్లే ఈ బడ్జెట్‌లోనూ నిధులు ఉండవన్నారు. బడ్జెట్‌పై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన అధికారపక్షంపై విరుచుకుపడ్డారు.

# దక్షిణాదిపై '50 శాతం' కుట్ర



- అదే జరిగితే ఈ ప్రాంతంతో అవసరం ఉండదు
- ఉత్తరాదిలోని 4 రాష్ట్రాల ఎంపీ సీట్లతో కేంద్రంలో అధికారంలోకి రావొచ్చు
- డీలిమిటేషన్‌పై పోరాటానికి సిద్ధం కావాలి
- ఓ టీవీ ఛానెల్ చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి

ఈకబురు, ఢిల్లీ: దేశంలో జనాభా సంఖ్య ఆధారంగా ఎంపీ సీట్లను 50 శాతం పెంచుతుండటం వెనుక కుట్ర దాగి ఉందని, అదే జరిగితే దక్షిణ భారతంతో సంబంధం లేకుండా ఉత్తర భారతంలోని నాలుగు రాష్ట్రాల సీట్లతో కేంద్రంలో అధికారంలోకి రావొచ్చని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దిల్లీలో మంగళవారం ఓ టీవీ ఛానెల్ ఏర్పాటు చేసిన చర్చ సందర్భంగా ఆయన నియోజకవర్గాల పునర్విభజన, 50 శాతం ఎంపీ సీట్ల పెంపు తదితర అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ఎంపీ స్థానాల విషయంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరం ఉంది. అంతే స్థాయిలో సీట్ల పెంపు జరగాలి. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో కేంద్రం అన్యాయం చేస్తోంది. వివక్ష చూపుతోంది. దక్షిణాది రాష్ట్రాలు డీలిమిటేషన్‌పై పోరాటానికి సిద్ధం కావాలి. 50 శాతం సీట్ల పెంపు ఏ లెక్క ప్రకారం జరుగుతుంది? అలా సీట్ల పెంపు అనేది దక్షిణాది రాష్ట్రాలపై ఫైనల్ బుల్లెట్. ఈ పద్ధతిలో తమిళనాడు, పుదుచ్చేరిలో ఇప్పుడున్న 40 సీట్లు 60 అవుతాయి. అదే యూపీలో 80 సీట్లు 120 అవుతాయి. అలా మధ్యప్రదేశ్, యూపీ, రాజస్థాన్, బిహార్...

మిగతా2లో



## యుద్ధ ప్రభావం.. సమర్థంగా ఎదుర్కొందాం: ప్రధాని మోదీ

- నపైనా యుద్ధ ప్రభావం
- అందుబాటులో ఉన్న వనరుల నుంచి గ్యాస్, ముడి చమురు సేకరిస్తున్నాం
- కొత్తగా ఏడు సాధికార బృందాలను ఏర్పాటు చేశాం
- రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రకటన

ఈకబురు, న్యూఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్రస్థాయిలో ఇంధన సంక్షోభం ఏర్పడిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. యుద్ధ ప్రభావం మనపైనా ఉందన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరుల నుంచి గ్యాస్, ముడి చమురు సేకరించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

02



02

## తొలి కారుణ్య మరణం.. పరిసమాప్తి

## మూసీ ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం

- మంచిరేవుల వీరభద్రస్వామి గుడి వద్ద నిర్మాణం
- 28న సీఎం రేవంత్ శంకుస్థాపన
- తర్వాత దశలో చర్చి, మసీదు, గురుద్వారా




03



## రాజీ లేదు.. రాజీనామానే!

- జీవన్‌రెడ్డి స్పష్టీకరణ
- ఫలించని మహేశ్‌కుమార్‌గౌడ్ మంత్రాంగం

02




## హోర్ముజ్ జలసంధిని తెరవాల్సిందే

- స్వేచ్ఛాయుత నౌకాయానానికి వీలు కల్పించాలి: మోదీ
- ప్రధానితో ఫోన్‌లో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

ఈకబురున్యూఢిల్లీ: పశ్చిమాసియాలో సాధ్యమైనంత త్వరగా శాంతియుత పరిస్థితులు నెలకొనాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు త్వరగా సమసిపోవాలని, అందుకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టంచేశారు. మోదీతో మంగళవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియా యుద్ధంతోపాటు ప్రధానంగా హోర్ముజ్ జలసంధి

మిగతా2లో



## జేడీయూ అధినేతగా నీతీశ్ ఏకగ్రీవ ఎన్నిక

ఈ-కబురు, ఢిల్లీ: బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ జేడీయూ అధ్యక్షుడిగా మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

03

## విశ్వనగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాం

- రూ.15 వేల కోట్లతో ప్రణాళిక
- 2026-27లో రూ.2,250 కోట్లతో పనులు
- శాసనసభలో మంత్రి శ్రీధర్‌బాబు

ఈకబురు, హైదరాబాద్: రాజధాని హైదరాబాద్‌ను అందరి సహకారంతో అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ట్రాఫిక్ కష్టాలు తగ్గించడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దీని కోసం రూ.15 వేల కోట్లతో పనుల ప్రణాళిక రూపొందించామని 202627లో రూ.2,250 కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు. హైదరాబాద్ ఎమ్మెల్యేలతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. శాసనసభలో మంగళవారం హైదరాబాద్ నగర అభివృద్ధి, ప్రాజెక్టుల అమలుపై ప్రశ్నోత్తరాల సమయంలో భారాస సభ్యుల ప్రశ్నలకు మంత్రి శ్రీధర్‌బాబు సమాధానం చెప్పారు. '



03

## నేడో, రేపో సీన్ రీ కన్‌స్ట్రక్షన్!

- చంచల్‌గూడ జైలు నుంచి డ్రగ్స్ కేసు నిందితులను కస్టడీకి తీసుకున్న 'సిట్'
- శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో విచారణ..హాజరైన ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్‌బాబు
- కొత్తగా మరో నలుగురి పేర్లు బయటకు వచ్చినట్టు సమాచారం



03

## మతం మారితే ఎస్సీ హోదా కోల్పోయినట్లే!



పైగా అతను దశాబ్దానికిపైగా క్రైస్తవాన్ని ఆచరిస్తున్నాడు. పాస్టర్‌గా సేవలందిస్తూ గ్రామాల్లో ప్రతి ఆదివారం ప్రార్థనలు నిర్వహిస్తున్నాడు. దాడి జరిగినట్లు చెబుతున్న రోజున కూడా అతను ఇంట్లో ప్రార్థనలు నిర్వహించాడు. ఈ వాస్తవాలన్నీ ఘటన జరిగిన నాటికి అతను క్రైస్తవుడేనని నిస్సందేహంగా నిరూపిస్తున్నాయి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

## హార్మూజ్ జలసంధిని తెరవాల్సిందే



ఈకబురున్యూఢిల్లీ: పశ్చిమాసియాలో సాధ్యమైనంత త్వరగా శాంతియుత పరిస్థితులు నెలకొనాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు త్వరగా సమసిపోవాలని, అందుకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టంచేశారు. మోదీతో మంగళవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియా యుద్ధంతోపాటు ప్రధానంగా హార్మూజ్ జలసంధి విషయంలో తాజా పరిణామాలపై వారు చర్చించుకున్నారు. స్వేచ్ఛాయుత నౌకాయానానికి వీలుగా హార్మూజ్‌ను తక్షణమే తెరవాలని మోదీ ఈ సందర్భంగా తేల్చిచెప్పారు. ట్రంప్ నుంచి తనకు ఫోన్ వచ్చిందని, పశ్చిమాసియా పరిస్థితులపై ఉపయోగకరమైన అభిప్రాయాలు పంచుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టుచేశారు. హార్మూజ్ జలసంధిని తెరిచి, అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం ప్రపంచం మొత్తానికి అత్యవసరమని స్పష్టంచేశారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం దిశగా చేపట్టే ప్రయత్నాలపై సంప్రదింపులు కొనసాగించాలని తాము నిర్ణయించామని స్పష్టంచేశారు. కీలకమైన షిప్పింగ్ మార్గాన్ని తెరిచి ఉంచాల్సిన ప్రాముఖ్యతపై నేతలు చర్చించారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు.

## రాజీ లేదు.. రాజీనామానే!



జగిత్యాల, ఈకబురు, : సీనియర్ నేత, మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడేందుకే సిద్ధమయ్యారు. పార్టీ తీరుపై అసంతృప్తితో ఉన్న ఆయనను బుజ్జగించేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్‌సావంత్ మంగళవారం జగిత్యాలకు వచ్చారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి జీవన్‌రెడ్డితో భేటీ అయ్యారు. 'కొన్ని నిర్ణయాల వల్ల బాధ ఉండొచ్చు.. సీనియర్ నాయకుడిగా కాంగ్రెస్‌కు మీ సేవలు అవసరం.. దయచేసి మీ ఆలోచన విరమించుకోవాలి. పార్టీ అన్ని విధాలా గౌరవిస్తుంది' అని మహేశ్‌కుమార్‌గౌడ్ కోరారు. 'జరిగిన అవమానం చాలు.. నిర్ణయం మార్చుకునేది లేదు. వార్డు సభ్యుల టికెట్లు కూడా అడిగే పరిస్థితి వచ్చినప్పుడు నేను ఇంకా ఎందుకు కొనసాగాలి. 20 నెలలుగా బాధపడుతున్నా నాకేం న్యాయం జరిగింది' అని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సందర్భంగా తన మెడలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేందర్ కండువా వేయడానికి యత్నించగా.. వారించిన జీవన్‌రెడ్డి దాన్ని పీసీసీ అధ్యక్షుడి మెడలో వేయించారు. అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. జీవన్‌రెడ్డిని పార్టీని వీడొద్దని కోరామని, ఆలోచన విరమించుకుంటారని భావిస్తున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి మంగళవారం సాయంత్రం వచ్చి జీవన్‌రెడ్డిని కలిశారు. ఆయన నిజాయతీ, నిబద్ధత రాహుల్‌గాంధీకి కూడా తెలుసని, ఆయన కాంగ్రెస్‌లోనే ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు. మంగళవారం ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ మరోసారి జీవన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడగా.. తన నిర్ణయంలో మార్పు ఉండదని ఆయన స్పష్టంచేశారు.

## తొలి కారుణ్య మరణం .. పరిసమాప్తి

ఈకబురు, దిల్లీ:దేశంలో కారుణ్య మరణానికి అనుమతి పొందిన మొదటి వ్యక్తిగా గుర్తించిన హరీశ్ రాణా (31) మంగళవారం దిల్లీలోని ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. 13 ఏళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో గాయపడి సుదీర్ఘ కోమాలోకి వెళ్లిపోయిన హరీశ్‌కు సుప్రీంకోర్టు కారుణ్య మరణం ప్రసాదిస్తూ మార్చి 11న చరిత్రాత్మక తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. నిబంధనల ప్రకారం అతడికి చికిత్సను నిలిపివేయడంతో మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. దిల్లీ సమీప గాజియాబాద్‌కు చెందిన హరీశ్ రాణా పంజాబ్ యూనివర్సిటీలో ఇంజినీరింగు చదువుతున్న రోజుల్లో 2013 ఆగస్టు 20న వసతిగృహ భవనం నాలుగో అంతస్తులోని బాల్కనీ నుంచి ప్రమాదవశాత్తు కిందకు పడిపోయారు. తలకు తీవ్రగాయమై కోమాలోకి వెళ్లిపోగా, తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. కుమారుడి చికిత్స పేరుతో ఆర్థికంగా, మానసికంగా చితికిపోయిన తల్లిదండ్రులు అతడి కారుణ్య మరణానికి అనుమతి కోరుతూ దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం హరీశ్‌ను మార్చి 14న గాజియాబాద్ ఇంటి నుంచి దిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించారు. డాక్టర్ సీమా మిశ్ర సారథ్యంలో ప్రత్యేకంగా ఏర్పడిన వైద్యుల బృందం హరీశ్‌కు అందిస్తున్న చికిత్సను అప్పట్నుంచీ దశలవారీగా తగ్గించడంతో పది రోజుల తర్వాత తుదిశ్వాస విడిచారు. తన కుమారుడు ఏళ్లతరబడి అనుభవించిన కోలుకోలేని బాధకు ఈ అనాయాస మరణం ఓ గౌరవప్రదమైన ముగింపు పలికిందని హరీశ్ రాణా తండ్రి అశోక్ రాణా తెలిపారు.

సమాజానికి హరీశ్ 'తుది కానుక'

కుమారుడు శాశ్వతంగా దూరమై పుట్టెడు దుఃఖంలో ఉన్న హరీశ్ రాణా తల్లిదండ్రులు అంతటి విషాదంలోనూ సమాజ హితం కోరి ఆదర్శప్రాయంగా ఆలోచించారు. హరీశ్ కళ్లను, గుండె కవాటాలను వీరు దానం చేయగా.. ఆసుపత్రి అధికారులు వాటిని భద్రపరిచారు.

# దక్షిణాదిపై '50 శాతం' కుట్ర

ఈ నాలుగు రాష్ట్రాల సీట్లతో కేంద్రంలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది. ఉత్తరాది రాష్ట్రాల్లో పెరిగే సీట్ల వల్ల దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వంలో, జాతీయ రాజకీయాల్లో దక్షిణాది రాష్ట్రాల నేతలకు చోటు లేకుండా పోతుంది. ఉత్తర, దక్షిణ భారతానికి మధ్య అంతరాన్ని ఎన్‌డీయే ప్రభుత్వం పెంచుతోంది. అన్ని రాజకీయ పక్షాలతో చర్చించి సీట్ల పెంపుపై ముందుకు వెళ్లాలి. దక్షిణాది రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తా.

మోదీ త్రీడీ పాలసీకి వ్యతిరేకంగా ఐక్యం కావాలి: ప్రధాని మోదీ త్రీడీ పాలసీని అవలంబిస్తున్నారు. డీలిమిటేషన్, డిస్క్రిమినేషన్, డివల్యూషన్ అనే మూడు అంశాలతో కూడిన విధానాన్ని పాటిస్తున్నారు. దక్షిణ భారతానికి కేంద్ర మంత్రివర్గంలో ప్రాధాన్యమున్న పోర్ట్‌ఫోలియోలను ఇవ్వడం లేదు. ఒక్క నిర్మలా సీతారామన్‌కు తప్ప టాప్10 పోర్ట్‌ఫోలియోలలో భాగస్వామ్యం లేదు. మోదీ గుజరాత్ నుంచి వచ్చి యూపీలో పోటీ చేసి ప్రధాన మంత్రి కావొచ్చు. మరి వెంకయ్యనాయుడిని ఎందుకు రాష్ట్రపతిని చేయలేదు? మొదటి నుంచి పార్టీలో ఉన్న వ్యక్తిని ఎందుకు పక్కన పెట్టారు? భారత్ అంతా ఒక్కటేనని భావించాలి కదా? ఎందుకు సమతౌల్యం పాటించరు? గతంలో దక్షిణ భారతం నుంచి జీఎంసీ బాలయోగి స్పీకర్‌గా పనిచేశారు. గత 12 సంవత్సరాల మోదీ పాలనలో దక్షిణ భారత రాష్ట్రాల నుంచి ప్రాధాన్యమున్న పదవుల్లో ఎవర్ని తీసుకున్నారు? మోదీ త్రీడీ పాలసీకి వ్యతిరేకంగా దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా ముందుకు కదలాలి'' అని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.



### యుద్ధ ప్రభావం..

# సమర్థంగా ఎదుర్కొందాం: ప్రధాని మోదీ



**ఎలాంటి సవాలుకైనా సిద్ధంగా ఉండాలి**

కోవిడ్-19 మహమ్మారి సమయంలో వేర్వేరు రంగాల్లో సవాళ్లను ఎదుర్కోవడానికి నిపుణులు, అధికారులతో కూడిన సాధికార బృందాలను ఏర్పాటు చేసిన తరహాలోనే.. సోమవారం కొత్తగా ఏడు బృందాలను ఏర్పాటు చేశామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. సప్లై చైన్స్, పెట్రోలియం, డీజిల్, ఎరువులు, సహజ వాయువు, ద్రవ్యోల్బణం వంటి కీలక అంశాలపై తక్షణ, దీర్ఘకాలిక వ్యూహాల ఆధారంగా చర్యలు తీసుకునే బాధ్యతను ఈ బృందాలకు అప్పగించినట్లు చెప్పారు. సమిష్టి కృషి ద్వారా ప్రస్తుత సంక్షోభాన్ని అధిగమించగలమన్న విశ్వాసం పూర్తిగా ఉందని వ్యాఖ్యానించారు.

రాబోయే రోజుల్లోనూ ప్రయత్నాలు కొనసాగుతాయని వెల్లడించారు. దేశంలో ఎరువుల సరఫరాకు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సమగ్ర వ్యూహాన్ని రూపొందిస్తున్నామని స్పష్టంచేశారు.ఈ మేరకు ప్రధాని మోదీ మంగళవారం రాజ్యసభలో ప్రకటన చేశారు. ఇంధన సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకొని లబ్ధి పొందడానికి కొన్ని శక్తులు కాచుకొని ఉంటాయని చెప్పారు. అందుకే నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. ఇంధనం, వంట గ్యాస్ బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. ఎగుమతి, దిగుమతి కార్యకలాపాల్లో ఎదురయ్యే ఇబ్బందులను అంచనా వేయడానికి, అవసరమైన పరిష్కార మార్గాలు రూపొందించడానికి ఇప్పటికే మంత్రులతో ఒకబృందాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ బృందం క్రమం తప్పకుండా సమావేశమవుతోందని అన్నారు.

దక్షిణాసియా యుద్ధం వల్ల మన దేశంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడడానికి, యుద్ధ ప్రభావాన్ని తగ్గించడానికి అవసరమైన వ్యూహాలపై సాధికార బృందాలు కసరత్తు చేస్తాయన్నారు. పశ్చిమాసియా సంక్షోభం ఒక ప్రత్యేకమైన స్వభావం కలదని, దానికి తగినట్టుగానే విభిన్నమైన రీతిలో పరిష్కారాలను రూపొందిస్తున్నామని వివరించారు. ప్రతి సవాలును మనం ఓర్పు, సంయమనం, ప్రశాంతమైన మనసుతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. పరిస్థితులు నిరంతరం మారుతున్నాయని, అందుకే ఎలాంటి సవాలుకైనా సిద్ధంగా ఉండాలని ప్రజలను కోరారు. పశ్చిమాసియా ప్రతికూల పరిణామాల ప్రభావం ఎక్కువ కాలం కొనసాగే పరిస్థితి కనిపిస్తోందని అన్నారు.

**శాంతి యత్నాలకు భారత్ మద్దతు**

ఎరువుల సరఫరా విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రధానమంత్రి భరోసా ఇచ్చారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. రాబోయే పంటల సీజన్‌లో సరిపడా ఎరువులు అందజేయడానికి చర్యలు చేపట్టామని అన్నారు. సంక్షోభంతో సంబంధం లేకుండా అధిక ఆర్థిక వృద్ధిని సాధించడం మన బాధ్యత అని వివరించారు. పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరతను కోరుకుంటున్నట్లు మోదీ పునరుద్ఘాటించారు. సమస్య పరిష్కారానికి చర్చలు, దౌత్య మార్గాలే శరణ్యమని తేల్చిచెప్పారు. దక్షిణాసియా లో శాంతి యత్నాలకు భారత్ మద్దతు కచ్చితంగా ఉంటుందన్నారు. అక్కడ ఉద్రిక్తతలు తగ్గిపోయి, హర్మూజ్ జలసంధి తెరుకోవాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. ఒకవేళ సంక్షోభం సుదీర్ఘ కాలం కొనసాగితే మరిన్ని తీవ్ర పరిణామాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఐనా.. ఆగని దాడులు!



అయితే ఈ విషయమై ప్రస్తుతానికి అమెరికా, ఇరాన్ నడుమ విశ్వాస కల్పన చర్యలు కొనసాగుతున్నట్టు ఈజిప్టు వెల్లడించింది. యుద్ధానికి తెర దించే దిశగా ఇరాన్‌తో రెండు రోజులకు పైగా కీలక చర్చలు జరుగుతున్నట్టు ట్రంప్ సోమవారం ప్రకటించడం తెలిసిందే. ''చర్చలు ఫలప్రదంగా సాగుతున్నాయి. ఇరాన్‌కు చెందిన ఒక ముఖ్య నేతతో పాటు పశ్చిమాసియా ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్, నా అల్లుడు జెరేడ్ కుష్నర్ వాటిలో పాల్గొంటున్నారు. చర్చలు ఈ వారమంతా కొనసాగుతాయి''అని ఆయన చెప్పారు. ఇరాన్ మాత్రం ట్రంప్ చర్చల వ్యాఖ్యలను ఖండించింది.

చమురు క్షేత్రాలకు నష్టం

ఇరాన్‌లోని ఉత్పత్తి కేంద్రాలే లక్ష్యంగా మంగళవారం భారీ స్థాయిలో దాడులు కొనసాగించినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. రాజధాని టెహ్రాన్ ఉత్తర ప్రాంతంలో భారీ పేలుడు శబ్దాలు విన్పించాయి. దాడుల్లో రెండు ఇంధన క్షేత్రాలు భారీగా దెబ్బ తిన్నట్టు ఇరాన్ వార్తా సంస్థ ఫార్స్ న్యూస్ పేర్కొంది. ''ఇస్ఫహాన్‌లోని సహజవాయు కేంద్రంపై పెద్ద ఎత్తున దాడులు జరిగాయి. ఖొర్రంషార్‌లో కీలక విద్యుత్కేంద్రానికి గ్యాస్ సరఫరా చేసే పైప్‌లైన్లు కూడా తీవ్రంగా దెబ్బ తిన్నాయి''అని పేర్కొంది. లెబనాన్‌పై కూడా ఇజ్రాయెల్ దాడులు చేసింది. బీరూట్ దక్షిణ శివార్లలో హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థ స్థావరాలే లక్ష్యంగా క్షిపణుల వర్షం కురిపించింది. ఒక అపార్ట్‌మెంట్‌పై జరిగిన దాడిలో కనీసం ముగ్గురు మృత్యువాత పడ్డట్టు లెబనాన్ ఆరోగ్య శాఖ ప్రకటించింది. దాడుల నేపథ్యంలో లెబనాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్ రాయబారిని దేశం వీడాల్సిందిగా ఆదేశించింది. ఇరాన్ విమానాలకు తమ గగనతలాన్ని మూసేస్తున్నట్టు కూడా ప్రకటించింది.

**యుద్ధ నెపం హెగ్సెత్‌పై!**

**దాడి చేద్దామన్నది ఆయనే: ట్రంప్**

వాషింగ్టన్: ఇరాన్‌పై ఏకపక్షంగా యుద్ధానికి దిగి ఇంటా బయటా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు ఆ నెపాన్ని ఇతరులపైకి నెట్టే ప్రయత్నాల్లో పడ్డారు. ఇరాన్‌పై దాడులు చేద్దామని తొలుత సూచించింది తమ రక్షణ మంత్రి పీట్ హెగ్సెతే అని ఆయన తాజాగా చెప్పుకొచ్చారు! టెనెసీలో జరిగిన ఓ కార్యక్రమం ఇందుకు వేదికైంది. ట్రంప్ ఆ వ్యాఖ్యలు చేసినప్పుడు హెగ్సెత్ ఆయన పక్కనే ఉండటం విశేషం.

''ఇరాన్ సమస్యపై ఆ మధ్య నా సన్నిహితులందరినీ పిలిచి లోతుగా చర్చించా. పరిస్థితిని వారికి వివరించా. అణు బాంబు తయారీకి ఇరాన్ చాలా దగ్గరికి వచ్చేసింది, ఏం చేద్దామని అడిగా. అందరికంటే ముందు హెగ్సెత్ స్పందించారు. ఇరాన్‌పై దాడి చేద్దామని చెప్పుకొచ్చారు''అన్నారు. అంతేగాక పక్కనే ఉన్న హెగ్సెత్‌కేసి తిరిగి, ''అంతేకదా! ఇరాన్‌పై దాడి చేద్దామని ముందుగా చెప్పింది నువ్వే కదా! ఇరాన్ అణుబాంబు తయారు చేసేందుకు అవకాశమివ్వొద్దని కూడా

టెల్ అవీవ్‌లో విధ్వంసం

ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైకి పలు దఫాలుగా క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. దాంతో టెల్ అవీవ్ నగరంలో భారీ విధ్వంసం జరిగినట్టు తెలుస్తోంది. 100 కిలోలకు పైగా బరువున్న వార్ హెడ్ సిటీ సెంటర్ సమీపంలోని వీధిపై పడింది. ఒక అపార్ట్‌మెంట్‌తో పాటు పలు భవనాలు దెబ్బ తిన్నాయి. నలుగురికి స్వల్ప గాయలయ్యాయి. ఇరాన్ డ్రోన్ దాడులతో కువైట్‌లో విద్యుత్ సరఫరా లైన్లు దెబ్బ తిన్నాయి. దాంతో పలు ప్రాంతాలు గంటల తరబడి చీకట్లో మగ్గాల్సి వచ్చింది. సౌదీ అరేబియా తూర్పు ప్రాంతంలోని చమురు క్షేత్రాలపై కూడా ఇరాన్ డ్రోన్ దాడులు చేసింది. పలు డ్రోన్లను తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు నేలకూల్చినట్టు యూఏఈ ప్రకటించింది. ఇరాన్ దాడుల్లో తమ సైనికుడు మరణించినట్టు బహ్రెయిన్ వెల్లడించింది. పలువురు సైనికులకు గాయాలైనట్టు తెలిపింది. యూఏఈలో జరిగిన దాడుల్లో మొరాకోకు చెందిన ఒక కాంట్రాక్టర్ మరణించినట్టు సమాచారం. బహ్రెయిన్‌లోని తమ డేటా సెంటర్‌లో కార్యకలాపాలకు డ్రోన్ దాడులతో అంతరాయం కలిగినట్టు అమెజాన్ సంస్థ వెల్లడించింది. దాడులతో అక్కడ సంస్థ కార్యకలాపాలు ప్రభావితం కావడం ఇది రెండోసారి.

ఇజ్రాయెల్‌లో 16కు పెరిగిన మృతుల సంఖ్య

ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతంలో హెజ్బొల్లా దాడుల్లో ఒక రైతు మరణించాడు. దాంతో ఆ దేశంలో మృతుల సంఖ్య 16కు పెరిగింది. యుద్ధం మొదలైనప్పటి నుంచీ 4,5654 మంది గాయపడ్డట్టు ఆ దేశ అత్యవసర వైద్య సేవల విభాగం పేర్కొంది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులకు బలైనవారి సంఖ్య 1,000 దాటింది. ఇక ఇరాన్‌లో ఇప్పటిదాకా 1,500 మందికి పైగా మరణించారు.



## ఎన్నికల బరి నుంచి తప్పుకొన్న కమల్ పార్టీ

చెన్నై, : తమిళనాడు శాసనసభ ఎన్నికల బరి నుంచి నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్‌హాసన్‌కు చెందిన మక్కళ్ నీది మయ్యం పార్టీ తప్పుకొంది. ప్రస్తుత క్లిష్ట రాజకీయ పరిస్థితుల్లో డీఎంకే కూటమిలో తమకు కేటాయిస్తామన్న సీట్ల సంఖ్య, డీఎంకే గుర్తుతో పోటీ చేయాలన్న ప్రతిపాదన పార్టీ సభ్యులకు, తనకు ఆమోదయోగ్యం కాదని కమల్‌హాసన్ మంగళవారం రాత్రి ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రతిపాదన వెనుక వారి (డీఎంకే) వైపు న్యాయం ఉందని కూడా అర్థం చేసుకొంటున్నట్లు తెలిపారు. తమిళనాడును హస్తగతం చేసుకోవాలని మతవాద శక్తులు అన్ని విధాలుగా కుట్ర చేస్తున్న నేపథ్యంలో కూటమి విజయావకాశాలే ప్రధానమన్నారు. రాష్ట్ర హక్కులను కేంద్రం ఒకటొకటిగా హరించి, ప్రజల సంక్షేమాన్ని తిరస్కరించిన పరిస్థితుల్లో.. కూటమిలో సీట్ల భాగస్వామ్యాన్ని కోరడం మంచి సోదరుడి లక్షణం కాదన్నారు. "ఇది త్యాగం కాదు, కర్తవ్యం.. స్వలాభం కాదు, సంయమనం" అని పేర్కొన్నారు. తద్వారా సరికొత్త రాజకీయాలకు బీజం వేస్తున్నట్లు తెలిపారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ ప్రత్యక్షంగా పోటీ చేయడం లేదని, డీఎంకే కూటమికి బేషరతు మద్దతు ఇస్తుందని ప్రకటించారు.

మీ త్యాగం చరిత్రాత్మకం: స్టాలిన్

కమల్ త్యాగానికి ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియడం లేదని, ఆయన నిర్ణయాన్ని చరిత్ర ప్రశంసిస్తుందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ట్వీట్ చేశారు. డీఎంకే మద్దతుతో కమల్‌హాసన్ ఇదివరకే రాజ్యసభకు వెళ్లిన విషయం తెలిసిందే.

## ప్రతిపక్షమంటే ప్రభుత్వానికి లెక్క లేదు



. కొన్ని గంటల తర్వాతగానీ ప్రారంభించడం లేదు. మేము వాకౌట్ చేసి బయటికి వచ్చాకనైనా.. తప్పులు సవరించుకుంటామని ప్రభుత్వం ఒక్క మాటైనా చెప్పలేదు. మేము వాకౌట్ చేస్తే.. సభకు రావాలని ప్రధాన ప్రతిపక్షానికి కనీసం అప్పీల్ చేయలేదు" అని అన్నారు.
శాసనమండలిలో బడ్జెట్‌పై ఉపముఖ్యమంత్రి భట్టి సమాధానాన్ని బహిష్కరిస్తున్నట్లు మండలి ప్రతిపక్ష నేత, భారాస ఎమ్మెల్సీ మధుసూదనాచారి తెలిపారు. మండలి వద్ద మీడియా పాయింట్ వద్ద మంగళవారం రాత్రి ఆయన మాట్లాడారు. "ఇష్టారాజ్యంగా సభను నడుపుతున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి లేదు. శాసనమండలిని అవమానపరిచే

## విశ్వనగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాం

''నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి రెండేళ్లలో రూ.122 కోట్లు ఖర్చు చేశాం. పాత బస్తీ, ఐటీ కారిడార్‌లలో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగిస్తాం. మూసీ నది సుందరీకరణతో పాటు హెచ్‌సిటీ కింద రూ.7,032 కోట్ల అంచనాతో 26 పనులతో పాటు రూ.1,500 కోట్లతో 49 లింక్ రోడ్లు, రూ.7,406 కోట్లతో మూడు ఎలివేటెడ్ కారిడార్లకు ఆమోదం తెలిపాం. గత ప్రభుత్వం ఎస్ఆర్‌డీపీ కింద చేపట్టిన పనులను ఎక్కడా ఆపలేదు. అవసరానికి అనుగుణంగా కొన్ని మార్పులు మాత్రమే చేశాం. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరలో వేగవంతం చేస్తాం. నగర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జవహర్‌నగర్ డంప్ యార్డు సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటాం. మా హయాంలో ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరగనీయం. మూసీ విషయంలో మంచి ఆలోచనతో ఉన్నప్పటికీ భారాస రాజకీయం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష వీడాలి. ఏపీతో సమానంగా అమృత్‌పథకంలో నగరాలు, పట్టణాల అభివృద్ధికి నిధులివ్వాలి. ఈమేరకు రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు, భాజపా ఎంపీలు ప్రయత్నాలు చేయాలి'' అని శ్రీధర్‌బాబు సూచించారు.

హైదరాబాద్ అభివృద్ధిపై ప్రభుత్వ నిర్లక్ష్యం: ప్రభుత్వం చేస్తున్న పనులు నత్తనడకలా సాగుతున్నాయని వాటిని తమ మనవళ్లు చూస్తారేమోనని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మూసీపై ఈస్ట్ వెస్ట్ కారిడార్ అభివృద్ధి చేస్తే రద్దీ తగ్గుతుందని సూచించారు. నగర దుస్థితి వల్ల ఇక్కడి నుంచి చాలా మంది వెళ్లిపోతున్నారని ముఠా గోపాల్ తెలిపారు. పాత పనులను రద్దు చేసి కొత్త టెండర్ల పేరుతో ఆలస్యం చేస్తున్నారని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, తమ నియోజకవర్గంలో ఓడిపోయిన నేత పేరు శిలాఫలకం మీద పెట్టి తనను అవమానించారన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి జవహర్‌నగర్ డంప్ యార్డ్ సమస్య పరిష్కారం కాకపోవడం తనను ఎంతగానో బాధిస్తోందని అన్నారు.

ప్రొటోకాల్ పాటించడం లేదు: భారాస శాసనసభాపక్ష ఉపనేత తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ, భారాస హయాంలో చేపట్టిన పనులను కాంగ్రెస్ తమవని చెబుతోందని అన్నారు. ''కేటీఆర్ చొరవతో కేసీఆర్ నిధులు ఇవ్వడం వల్ల 10 సంవత్సరాలలో రూ.63 వేల కోట్లతో రహదారులు, డ్రైనేజీ, వాననీటి పైపు లైన్ వంటి అభివృద్ధి పనులు జరిగాయి. మూసీలో మురుగు నీటి శుద్ధికి ఎస్టీపీలను నిర్మించిన ఘనత కేటీఆర్‌ది. గత 28 నెలల్లో వర్షాలతో రోడ్లు కొట్టుకుపోతే మరమ్మతులు లేవు. మేం చేసిన అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. స్పీకర్ దృష్టికి తీసుకొచ్చినా స్పందన లేదు'' అని విమర్శించారు.



### భారాస ఎమ్మెల్యేల విమర్శలు

అంతకుముందు భారాస ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. రెండేళ్లలో కేవలం రూ.122 కోట్లు ఖర్చు చేస్తే పనులు ఎప్పుడు పూర్తవుతాయని ప్రశ్నించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. వివేకానందగౌడ్ మాట్లాడుతూ 'భారాస హయాంలో ఎస్ఆర్‌డీపీ ద్వారా ట్రాఫిక్‌ను 30 నుంచి 40 శాతం వరకు తగ్గించాం. కాంగ్రెస్ ప్రభుత్వం భారాస చేపట్టిన పనులను రద్దు చేస్తోంది' అని విమర్శించారు.

## నేడో, రేపో సీన్ రీ కన్‌స్ట్రక్షన్!



ఈకబురు, ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితులను సిట్ విచారించింది. రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి, అతని సోదరుడు రితీష్‌రెడ్డి, ఢిల్లీకి చెందిన రియల్ వ్యాపారి నమిత్‌శర్మను మంగళవారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి సిట్ అధికారులు కస్టడీకి తీసుకొని బందోబస్తు మధ్య శంషాబాద్ ఠాణాకు తరలించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విచారణ కొనసాగింది. మొదట రోహిత్‌రెడ్డితో ప్రారంభించి, ముగ్గురిని వేర్వేరుగా విచారించారు.

సిట్ బృందం ఆధ్వర్యంలో ఈ కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్న ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్‌బాబు మధ్యాహ్నం శంషాబాద్ ఠాణాకు వచ్చి నిందితులను స్వయంగా విచారించారు. వేర్వేరుగా ముగ్గురిని విచారించి పలు ప్రశ్నలకు సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉండగా.. ఫామ్‌హౌస్‌లో కుటుంబ సభ్యులతో పార్టీలు మాత్రమే జరుగుతుంటాయని రోహిత్‌రెడ్డి అడ్వొకేట్ శ్రీకాంత్‌రెడ్డి మీడియాతో తెలిపారు. పాత సంఘటలను కాకుండా ఈ కేసుకు సంబంధించిన విషయాలు మాత్రమే విచారించాలని కోర్టు సూచించినట్టు చెప్పారు.

డ్రగ్స్ కొనుగోలు, కాల్పుల వ్యవహారంపై ఆరా కాల్పుల వ్యవహారం, డ్రగ్స్ కొనుగోలు అంశాలపై సిట్ అధికా రులు నిందితులను ప్రశ్నించినట్టు తెలిసింది. డ్రగ్స్ ఎక్కడ కొను గోలు చేశారు.. ఎవరు సరఫరా చేశారు.. డ్రగ్స్ పార్టీలు ఎప్పటి నుంచి జరుగుతున్నాయి వంటి ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేసినట్టు సమాచారం. కాల్పుల వ్యవహారంపై నమిత్‌శర్మను ప్రశ్నించి పలు విషయాలు తెలుసు కున్నారు. డ్రగ్స్ పార్టీ ఏర్పాటు చేసింది రోహిత్‌రెడ్డే కావడంతో ఆయన నుంచి కీలక విషయాలు రాబట్టేందుకు సిట్ అధికారులు పలు ప్రశ్నలు సంధించారు. కానీ ఆయన సరైన సమాధానాలు ఇవ్వలేదని తెలుస్తోంది. విచారణలో నాలుగు కొత్త పేర్లు బయటకొచ్చినట్టు సమాచారం. మిగిలిన రెండు రోజుల విచారణలో డ్రగ్స్ మూలాలకు సంబంధించిన వివరా లను రాబట్టాలని పోలీసులు భావిస్తున్నారు. నిందితులను ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం.

## రాష్ట్ర బడ్జెట్ ఓ ఎండమావి



ఈకబురు, హైదరాబాద్: ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను భాజపా శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎండమావితో పోల్చారు. ఎండమావిలో నీళ్లు ఉండనట్లే ఈ బడ్జెట్‌లోనూ నిధులు ఉండవన్నారు. బడ్జెట్‌పై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన అధికారపక్షంపై విరుచుకుపడ్డారు. ''వాస్తవాలు దాచిపెట్టి, ప్రజలను మభ్యపెడుతున్నారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ ఎలా సాధిస్తారో చెప్పాలి. 201314 నుంచి ఇప్పటివరకు జీఎస్‌డీపీ రూ.17.81 లక్షల కోట్లు మాత్రమే. ఏడాదికి సగటున రూ.లక్షన్నర కోట్లకు మించడంలేదు. అలాంటప్పుడు వచ్చే తొమ్మిదేళ్లలో రూ.90 లక్షల కోట్లకు ఎలా చేరుకుంటారు? కాగ్ నివేదికను చూస్తే ఈ ఏడాది జనవరి వరకు రెవెన్యూ వసూళ్లు 60% మాత్రమే వచ్చాం. 2నెలల్లో మిగతా 40% వసూళ్లు ఎలా సాధ్యం? వాస్తవ అంచనాలకు, సవరించిన అంచనాలకు మధ్య రూ.26 వేల కోట్ల వ్యత్యాసముంది. దీన్నిబట్టి చూస్తే బడ్జెట్ ఎస్టిమేషన్ అంటే భట్టి ఎస్టిమేషన్ అని, రివైజ్డ్ ఎస్టిమేషన్ అంటే రేవంత్ ఎస్టిమేషన్ అని అనుకోవాల్సి వస్తుంది. వారిద్దరి మధ్య ఎంత వ్యత్యాసముందో ఈ రెండింటి మధ్య కూడా అంతే వ్యత్యాసముంది.

రాబోయే తరాలపై అప్పుల భారం

రూ.రెండు లక్షల కోట్ల అప్పులను రీస్ట్రక్చరింగ్ చేశామంటున్నారు. ఇప్పుడు కట్టాల్సిన అప్పులను రాబోయే 39 ఏళ్లకు లెక్కలు రాసిపెట్టారు. అంటే రాబోయే తరాలకు ఇప్పుడే అప్పులు సిద్ధం చేసిపెట్టారన్నమాట. గత, ప్రస్తుత ప్రభుత్వాల నిర్వాకంతో రాష్ట్రంలో పుట్టే ప్రతిబిడ్డపై రూ.2లక్షల కోట్ల అప్పు జమ అవుతోంది. గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3,47,000 కోట్ల అప్పు చేసింది. ఎన్ని అప్పులు తెచ్చినా హామీలను నెరవేర్చే పరిస్థితి లేదు. 2017లో ఏడాదికి ఐదు రోజులు ఓవర్‌డ్రాఫ్ట్ ఉంటే ఇప్పుడది 145 రోజులకు చేరింది. 2025 నవంబరులో 30 రోజులు అప్పుల మీదనే నెట్టుకొని రావడం రాష్ట్ర ఆర్థిక దుస్థితికి నిదర్శనం. పైగా అప్పులపై అబద్ధాలు చెబుతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో వడ్డీ చెల్లింపులు రూ.19,369 కోట్లుగా చూపించారు. కాగ్ నివేదికలో ఈ ఏడాది జనవరి నాటికే రూ.24,085 కోట్లుగా ఉంది. ఈ లెక్కల్లో తప్పిదం ఎలా జరిగింది? కేంద్రం గత ఐదున్నరేళ్లలో తెలంగాణకు రూ.13 లక్షల కోట్ల నిధులు మంజూరు చేసింది'' అని ఏలేటి వివరించారు.

**విభజన హామీలను నెరవేర్చలేదని మంత్రుల మండిపాటు**

ఏలేటి విమర్శలపై మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌లు ఎదురుదాడికి దిగారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... ఈ ప్రభుత్వం వరుసగా మూడోసారి ఛీటింగ్ బడ్జెట్ ప్రవేశపెట్టి హ్యాట్రిక్ సాధించిందన్నారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు కల్పించుకొని పవిత్రమైన బడ్జెట్‌ను ఛీటింగ్ బడ్జెట్‌గా సంబోధించడం అన్‌పార్లమెంటరీ అవుతుందని మండిపడ్డారు. దీనికి మహేశ్వర్‌రెడ్డి సమాధానమిస్తూ తాను బడ్జెట్‌తో ప్రజలను ఛీటింగ్ చేశారని చెప్పానన్నారు. ఈలోపే స్పీకర్ కల్పించుకొని మహేశ్వర్‌రెడ్డి మాటలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. మహేశ్వర్‌రెడ్డి చర్చను కొనసాగిస్తూ... ఆదాయం కోసం అబ్కారీపై ఆధారపడుతున్నారని విమర్శించారు. దీనిపై మంత్రి జూపల్లి కల్పించుకొని భారాస దిగిపోయే నాటికి ఎంత ఆదాయం వచ్చేదో ఇప్పుడూ



అంతే వస్తోందన్నారు. ఈలోగా మంత్రి పొన్నం కల్పించుకొని తెలంగాణకు కేంద్రం ఏంచేసిందో చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. రాముడి పేరిట రాజకీయాలు చేస్తున్నారని, తానూ రామభక్తుడినే అంటూ శ్లోకాలు చదివారు. మరో మంత్రి వాకిటి శ్రీహరి కల్పించుకొని గాంధీని గాడ్సే చంపడం తప్పని భాజపా వాళ్లు చెప్పగలరా అని నిలదీశారు. దీనికి మహేశ్వర్‌రెడ్డి సమాధానం చెబుతూ గాంధీని గాడ్సే చంపడం తప్పేనన్నారు.

గాంధీ హత్యపై సభలో చర్చ

మంత్రి సీతక్క జోక్యం చేసుకొంటూ... ''కార్పొరేట్ సంస్థలకు రూ.16 లక్షల కోట్లను మాఫీ చేసిన మోదీ ప్రభుత్వానికి రైతుల రుణాలను రద్దు చేయడానికి చేతులు రావడంలేదు. అష్టదిగ్గజాల మాదిరి భాజపాకు ఎనిమిది మంది చొప్పున ఎమ్మెల్యేలు, ఎంపీలున్నా... కేంద్రం నుంచి పైసా నిధులు తేలేదు. విభజన హామీలనైనా పూర్తి చేయలేదు. పైగా ప్రపంచం మొత్తం కీర్తించే గాంధీ పేరును లేకుండా చేస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని వీబీ జీరామ్‌జీ యాక్ట్‌గా మార్చడమే ఇందుకు నిదర్శనం. గాంధీని చంపిన ఆరెస్సెస్‌కు చెందిన గాడ్సేను పొగుడుతున్నారు'' అని దుయ్యబట్టారు. దాంతో భాజపా సభ్యులు పెద్దగా అరుస్తూ అభ్యంతరం వ్యక్తంచేశారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... గాడ్సే ఆరెస్సెస్ సభ్యుడు కాదని, ఈ విషయం సుప్రీంకోర్టు కూడా ధ్రువీకరించిందని, సీతక్క మాటలను రికార్డుల నుంచి తొలగించాలన్నారు. జీహెచ్ఎంసీని... 'గ్రేటర్ హైదరాబాద్ మజ్లిస్, కాంగ్రెస్'గా మార్చారని విమర్శించగా మజ్లిస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు.

## జేడీయూ అధినేతగా నీతీశ్ ఏకగ్రీవ ఎన్నిక



. పార్టీ అధ్యక్ష పదవికి లలన్ సింగ్ 2023 డిసెంబరులో రాజీనామా చేసినప్పటి నుంచీ నీతీశ్ ఆ పదవిలో ఉన్నారు. ఆయన ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా విజయం సాధించిన విషయం తెలిసిందే. తాజాగా పార్టీ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికకు మాజీ ఎంపీ అనీల్ ప్రసాద్ హెగ్డే రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. పార్టీ అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు మరెవరూ నామినేషన్ దాఖలు చేయని నేపథ్యంలో నీతీశ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు హెగ్డే ప్రకటించారు.

## హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం



మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీ వర్షం కురిసింది. కొన్నిచోట్ల ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన కూడా పడింది. మియాపూర్, కూకట్‌పల్లి, బోరబండ, చందానగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, పటాన్‌చెరు, బాచుపల్లి వంటి పలు ప్రాంతాల్లో రాళ్ల వర్షంతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. అమీర్‌పేట్, బేగంపేట్, ఎస్ఆర్ నగర్, సికింద్రాబాద్, యూసుఫ్‌గూడ, మణికొండ, బోరబండ, చందానగర్ పలు ప్రాంతాల్లో మోస్తారు వర్షం కురిసింది. కార్యాలయాల నుండి ఇంటికి వెళ్లే సమయంలో వర్షం పడటంతో ఐటీ కారిడార్‌తో పాటు ప్రధాన రహదారులన్నీ జలమయమై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అకస్మాత్తుగా కురిసిన ఈ భారీ వానతో రోడ్లు జలమయమై, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రానున్న 23 రోజులు తెలంగాణలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ (IMD) యెల్లో అలర్ట్ జారీ చేసింది.

# మూసీ ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం

**ఈ-కబురు, హైదరాబాద్: మత సామరస్యానికి ప్రతీకగా మూసీ నది పరీవాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం.. భారీ శివాలయ నిర్మాణంతో ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టబోతోంది. అందులో భాగంగా గండిపేట మండలం మంచిరేవుల గ్రామ పరిధిలోని 800 సంవత్సరాల చరిత్ర కలిగిన వీరభద్రస్వామి ఆలయం, 1,400 ఏళ్ల నాటి మచిలేశ్వర ఆలయం వద్ద నూతనంగా ఓంకారేశ్వర మందిరాన్ని నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించింది. కర్ణాటకలోని శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సూచనలు, సలహాలతో ఆలయ నిర్మాణ శైలి ఖరారైంది. ఈ పనులకు వీరభద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో నెల 28న ఉదయం 8.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమంలో శృంగేరిపీఠం ముఖ్య ప్రతినిధులు పాల్గొంటారు.**



**అభివృద్ధికి మొదటి మెట్టు..**

పశ్చిమాన ఉన్న జంట జలాశయాల నుంచి తూర్పున ప్రతాపసింగారం వరకు నగరంలో మూసీ 55 కి.మీ పొడవున ప్రవహిస్తోంది. ఈ పరిధిలో నాలుగు మతాలకు సంబంధించిన ప్రార్థనాలయాలను నిర్మించి.. అభివృద్ధి పనులను మత సామరస్యానికి ప్రతీకగా నిలపాలని సీఎం లక్ష్యంగా పెట్టుకున్నారు. మంచిరేవులలోని పురాతన వీరభద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని, పురానాపూల్ వద్ద భారీమసీదు, గౌలిగూడ వద్ద గురుద్వారా, నాగోల్‌లో చర్చి నిర్మాణం చేపట్టాలని ప్రణాళిక సిద్ధం చేశారు. జంట జలాశయాల నుంచి బాపూఘాట్ వరకు త్వరలో చేపట్టనున్న మూసీ తొలిదశ అభివృద్ధి పనులను ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి శంకుస్థాపనతో ప్రారంభించబోతున్నారు.

**చరిత్రాత్మక మందిరాలు..**

గండిపేట జలాశయం దిగువన గుట్టపై ఉన్న వీరభద్రస్వామి దేవాలయం కాకతీయుల కాలం నాటిదని, పక్కనే ఉన్న మచిలేశ్వర శివలింగాన్ని చాళుక్యులు ప్రతిష్ఠించినట్లు ఆలయ నిర్వాహకులు పరమేశ్వర్ తెలిపారు. ఈ దేవాలయాలను పునరుద్ధరించడంతో పాటు.. పక్కనే 8 ఎకరాల విస్తీర్ణంలో ఓంకారేశ్వర మందిరాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆలయంలో ఎత్తయిన గాలి గోపురం.. అందులో నుంచి లోపలికి వెళ్తే వేర్వేరు మండపాలు ఉంటాయి. అక్కడి నుంచి లోపలికి వెళ్లాక ఓంకారేశ్వర మందిరం ఉంటుంది. గర్భాలయ గోపురాన్ని 14 అడుగుల పొడవు, 14 అడుగుల వెడల్పు.. 64 అడుగుల ఎత్తుతో నిర్మించనున్నారు. యాదగిరిగుట్ట గర్భాలయం తర్వాత ఓంకారేశ్వర స్వామి గర్భాలయమే పెద్దదిగా ఉండనుంది.

**దాతలు, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో..**

ప్రాజెక్టుకు రూ.700 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. మూసీ తొలిదశ పనుల్లో ఆలయ నిర్మాణం భాగమని, వ్యయంలో దాతలు, ప్రైవేటు సంస్థలను భాగస్వాములను చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. 'ఈ దేవాలయానికి ఓఆర్ఆర్ నుంచి విశాలమైన రోడ్డు మార్గాలను నిర్మిస్తాం. ఆలయం వద్ద వెయ్యి నుంచి 2 వేల వాహనాలకు పార్కింగ్ వసతి కల్పిస్తాం. దిగువనున్న మూసీపై చిన్నపాటి ఆనకట్టను కట్టి.. నీటిని నిల్వ ఉంచాలన్నది ప్రణాళిక. అక్కడ నది మధ్యలోని దీవిపై నిల్చున్న 100 అడుగుల శివుని విగ్రహం ఏర్పాటవుతుంది. చుట్టూ పార్కులను అభివృద్ధి చేసి, బోటింగ్, ఇతర సౌకర్యాలను కల్పిస్తాం ''అని ప్రభుత్వం తెలిపింది.

## చట్టసభల్లో పెరగనున్న మహిళా ప్రాతినిధ్యం

**ఈ-కబురు,**

దేశవ్యాప్తంగా నియోజకవర్గాలు పెరగనున్నాయి. నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్డీఏ సమావేశంలో స్పష్టమైన సంకేతాలు అందాయి దీనిపై. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే పునర్విభజన బిల్లు పార్లమెంట్లో ఆమోదించనున్నారు. అదే జరిగితే దేశవ్యాప్తంగా పార్లమెంట్ సీట్లతో పాటు అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల సంఖ్య గణనీయంగా పెరగనుంది. అయితే ఇప్పటికే మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తూ 2023లో పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందింది. అయితే ఇప్పుడు పునర్విభజన బిల్లుతో పాటు మహిళా బిల్లును కూడా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం సంచలనంగా మారింది. పునర్విభజనకు సంబంధించి ఏపీలో 50% చొప్పున అసెంబ్లీ, లోక్సభ సీట్లు పెరగనున్నాయి.

**మహిళా రిజర్వేషన్లు అమలు..**

ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంటు సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ తాజా ప్రతిపాదనతో అసెంబ్లీ స్థానాలు 263, లోక్సభ సీట్లు 38 కి చేరుకుంటాయి. మహిళా ప్రాతినిధ్యం కూడా పెరగనుంది. వారికి 87 అసెంబ్లీ, 13 పార్లమెంట్ సీట్లు దక్కనున్నాయి. అయితే ఫలానా నియోజకవర్గం మహిళలకు రిజర్వ్ చేస్తారని చెప్పడం కష్టం కానీ.. మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండే నియోజకవర్గాలను మాత్రం మహిళలకు రిజర్వ్ చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో 58 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికం. వాటిని మహిళలకు రిజర్వ్ చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

**అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే.**

రాష్ట్రంలో ప్రధానంగా భీమిలి నియోజకవర్గంలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. అక్కడ ఏకంగా 1,65,570 మంది మహిళలు ఉండడం విశేషం. పాణ్యం, గాజువాక, చంద్రగిరి, తిరుపతి, మంగళగిరి, పెనమలూరు, రంపచోడవరం, పెందుర్తి, గురజాల, విశాఖపట్నం నార్త్, కోవూరు, కర్నూలు, విజయవాడ ఈస్ట్, విజయవాడ సెంట్రల్, గుంటూరు వెస్ట్, గన్నవరం, మైలవరం, నెల్లూరు రూరల్, తెనాలి, నంద్యాల, అనంతపురం అర్బన్, ఇచ్ఛాపురం, కడప, శ్రీకాకుళం, చింతలపూడి, రాజమహేంద్రవరం సిటీ, ప్రత్తిపాడు, రాజమహేంద్రవరం రూరల్, గుంతకల్లు, కాకినాడ సిటీ, పలమనేరు, విశాఖపట్నం ఈస్ట్, మాచర్ల, వినుకొండ, కాకినాడ రూరల్, భీమవరం, రాయదుర్గం, మదనపల్లి, పోలవరం, కావలి, జమ్మలమడుగు, కొత్తపేట, పాయకరావుపేట, శ్రీకాళహస్తి, ప్రొద్దుటూరు, ఆదోని, విజయనగరం, రాయచోటి, కదిరి, రాప్తాడు, ఆలూరు, గుంటూరు ఈస్ట్, విజయవాడ వెస్ట్, గూడూరు, ఒంగోలు, బనగానపల్లె, తాడిపత్రి నియోజకవర్గాల్లో మహిళలు అధికం

**పార్లమెంట్ స్థానాలు..**

పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి విశాఖపట్నంలో అత్యధికంగా 9,20,376 మంది మహిళలు ఉన్నారు. ఆ తరువాత స్థానాల్లో గుంటూరు, నరసరావుపేట, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, నంద్యాల, విజయవాడ, కర్నూలు, కాకినాడ, ఏలూరు, కడప, చిత్తూరు, రాజంపేట, శ్రీకాకుళం, అనకాపల్లి, హిందూపురం, రాజమండ్రి, ఒంగోలు, అరకు, విజయనగరం, మచిలీపట్నం, బాపట్ల, అమలాపురం, నరసాపురం పార్లమెంట్ స్థానాల్లో మహిళలు ఎక్కువ. ఇవి అధికారిక లెక్కలు మాత్రమే. పాలకుల ఆలోచన ఎలా ఉందో ప్రక్రియ మొదలైతే కానీ తెలియదు.



## భారీ లాభాలు

### సెన్సెక్స్ 1372, నిఫ్టీ 400 పాయింట్లు పైకి

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. ఇరాన్‌పై దాడుల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఐదు రోజుల విరామం ప్రకటించడం స్టాక్ మార్కెట్‌కు ఊతమిచ్చింది. ట్రంప్ ప్రకటనతో అంతర్జాతీయంగా చమురు ధరలు దిగి రావడమూ కలిసొచ్చింది. దీంతో నిన్నటి భారీ నష్టాల నుంచి సూచీలు గట్టెక్కాయి. సెన్సెక్స్ ఓ దశలో 1700 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 23 వేల మార్కును అందుకుంది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ ఒక్కరోజులోనే రూ.7 లక్షల కోట్లు పెరిగి రూ.423 లక్షల కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 74,212.47 పాయింట్ల వద్ద లాభాల్లో (క్రితం ముగింపు 72,696.39) ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 74,489.39 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1372.06 పాయింట్ల లాభంతో 74,068.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 399.75 పాయింట్ల లాభంతో 22,912.40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 93.86గా ఉంది. సెన్సెక్స్30 సూచీలో ఎల్అండ్‌టీ, ఇండిగో, ఎటర్నల్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్ స్టాక్స్ లాభపడగా.. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎస్‌బీఐ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 101 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4430 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## రైల్వే ప్రయాణికులకు అలర్ట్!

# టికెట్ క్యాన్సిలేషన్‌కు కొత్త రూల్స్




భారతీయ రైల్వే (Indian Railways) టికెట్ క్యాన్సిలేషన్ ఛార్జీల విషయంలో కీలక మార్పులు చేసింది. ట్రైన్ బయల్దేరే సమయం ఆధారంగా టికెట్ సొమ్మును రిఫండ్ చేసే విధానాన్ని సవరించింది. కొత్త రూల్స్ ప్రకారం 72 గంటల ముందు ఎవరైనా కన్ఫామ్ టికెట్‌ను రద్దు చేసుకుంటే పూర్తి మొత్తం రిఫండ్ (క్యాన్సిలేషన్ ఛార్జీలకు లోబడి) చేసేలా మార్పులు చేసింది. బోర్డింగ్ పాయింట్ నిబంధనలనూ మార్చింది. ఈ మేరకు కొత్తగా తీసుకొచ్చిన పలు సంస్కరణలను రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వివరించారు. ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 15 మధ్య దశలవారీగా ఈ మార్పులు అమలు చేయనున్నట్లు ప్రకటించారు.

**కొత్త రూల్స్ ఇలా..**

ప్రయాణానికి 72 గంటల ముందు టికెట్‌ను రద్దు చేసుకుంటే 'మ్యాగ్జిమమ్ రిఫండ్' చేస్తారు. కొంత క్యాన్సిలేషన్ ఛార్జీలను ఉపసంహరించుకుని మిగిలిన మొత్తాన్ని రిఫండ్ చేస్తారు.

ట్రైన్ బయల్దేరడానికి 72 గంటల నుంచి 24 గంటల మధ్య టికెట్ రద్దు చేస్తే 'స్టాండర్డ్ పెనాల్టీ' విధిస్తారు. టికెట్ ధరలో 25 శాతం మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని (కనీస ఛార్జీ ఆధారంగా) రిఫండ్ చేస్తారు.

ట్రైన్ బయల్దేరడానికి 24 గంటల ముందు నుంచి 8 గంటల మధ్య టికెట్ రద్దు చేసుకుంటే 'లేట్ క్యాన్సిలేషన్'గా పరిగణించి 50 శాతం ఫేర్‌ను మినహాయించి మిగిలిన మొత్తం రిఫండ్ చేస్తారు. ప్రయాణానికి 8 గంటల ముందు గానీ, ట్రైన్ బయల్దేరిన తర్వాత ఎవరైనా టికెట్ రద్దు చేసుకుంటే ఎలాంటి రిఫండ్ ఉండదు.

దీంతో పాటు ప్రయాణానికి 30 నిమిషాల ముందు వరకు బోర్డింగ్ పాయింట్ మార్చుకునే సదుపాయాన్నీ రైల్వేశాఖ కల్పించింది. ముఖ్యంగా నగరాల్లో ఎక్కువ స్టేషన్లు ఉన్నప్పుడు ఈ వెసులుబాటును ప్రయాణికులు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతానికి చార్ట్ ప్రిపేర్ చేయడానికి ముందు వరకు మాత్రమే అనుమతిస్తున్నారు.

గతంలో కౌంటర్ టికెట్‌ను రద్దు చేసుకోవాలంటే రైలు ప్రారంభమయ్యే స్టేషన్‌లో మాత్రమే వెసులుబాటు ఉంది. ఇకపై ఏ స్టేషన్‌లోనైనా క్యాన్సిల్ చేసుకోవచ్చు.

అలాగే, ఇటికెట్ కలిగిన ప్రయాణికులు టికెట్ డిపాజిట్ రిసీట్ (TDR) ఫైల్ చేయాలంటే మాన్యువల్‌గా చేయాల్సి వచ్చేది. ఇకపై ప్రయాణికుడి ప్రమేయం లేకుండా టీడీఆర్ రూల్స్‌ను అనుసరించి ఆటోమేటిక్‌గా రిఫండ్ చేస్తారు.

కౌంటర్ టికెట్‌పై ప్రయాణానికి 30 నిమిషాల ముందు కూడా ఇకపై ప్రయాణ తరగతిని అప్‌గ్రేడ్ చేసుకునే వెసులుబాటును కల్పిస్తున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

### క్యాన్సిలేషన్ ఛార్జీలు ప్రస్తుతం ఇలా..

ప్రస్తుతం రైలు బయల్దేరడానికి 48 గంటల ముందు టికెట్ రద్దు చేసుకుంటే ఏసీ ఎగ్జిక్యూటివ్/ఏసీ ఫస్ట్ క్లాస్ ప్రయాణికుల నుంచి రూ.240+ జీఎస్టీ; ఏసీ 2 టైర్/ ఫస్ట్‌క్లాస్‌కు రూ.200+ జీఎస్టీ; ఏసీ త్రీటైర్/ఏసీ ఛైర్ కార్/ఏసీ ఎకానమీ తరగతి టికెట్లకు రూ.180+ జీఎస్టీ చొప్పున క్యాన్సిలేషన్ ఛార్జీలు విధిస్తున్నారు. స్లీపర్ క్లాస్‌కు రూ.120, సెకండ్ క్లాస్‌కు రూ.60 చొప్పున వసూలు చేస్తున్నారు. అదే ప్రయాణానికి 48 గంటల నుంచి 12 గంటల ముందైతే 25 శాతం, 12 గంటల నుంచి 4 గంటల మధ్య 50 శాతం టికెట్ ధరను మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని రిఫండ్ చేస్తున్నారు. ప్రయాణానికి 4 గంటల కంటే తక్కువ సమయం ఉంటే రిఫండ్‌ను అనుమతించడం లేదు.




### మొన్న జొమాటో.. నేడు స్విగ్గీ: కస్టమర్లపై ప్లాట్‌ఫామ్ ఫీజుల భారం

ఫుడ్ డెలివరీ యాప్‌లు కస్టమర్లకు షాకిస్తున్నాయి. మొన్నటికి మొన్న జొమాటో ప్లాట్‌ఫామ్ ఫీజును పెంచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు స్విగ్గీ (Swiggy) కూడా అదే బాట పట్టింది. ప్లాట్‌ఫామ్ ఫీజును (Swiggy Platform Fee) రూ.14.99 నుంచి రూ.17.58కి (జీఎస్టీ కలిపి) పెంచింది. అంటే.. వినియోగదారులు ఒకపై ఒక్కో ఆర్డర్‌కు అదనంగా రూ.2.59 చెల్లించాల్సి ఉంటుంది.

పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా చమురు ధరలు పెరుగుతున్నాయి. మరోవైపు ఇంధన కొరత కూడా వేధిస్తోంది. ఈ నేపథ్యంలో ఖర్చు భారాన్ని తగ్గించుకునేందుకు ఫుడ్ డెలివరీ యాప్‌లు ఈ ఫీజులను పెంచుతున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ పెంపుపై నెటిజన్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. "డిస్కౌంట్లు, సబ్సిడీల కాలం పోయింది. కంపెనీల లాభాల దశ మొదలైంది" అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.

స్విగ్గీ యూనిట్ ఎకనామిక్స్‌ను మెరుగుపరిచేందుకు 2023 ఏప్రిల్ నుంచి కంపెనీ ప్లాట్‌ఫామ్ ఫీజును వసూలు చేయడం ప్రారంభించింది. తొలుత ఈ ఛార్జీ రూ.2 మాత్రమే కాగా.. ఆ తర్వాత నుంచి క్రమంగా పెంచుతూ పోతోంది. చివరిసారిగా గతేడాది సెప్టెంబరులో రూ.14.99కి పెంచింది. ఇప్పుడు మరోసారి ఈ ఫీజును సవరించింది. వినియోగదారులకు ఈ పెంపు పెద్దగా భారం అనిపించకపోయినా.. ప్రతిరోజూ లక్షల ఆర్డర్లను సప్లై చేసే స్విగ్గీకి మాత్రం ఇది గణనీయమైన అదనపు ఆదాయాన్ని సమకూర్చనుంది.

## BHIMలో కొత్త సదుపాయం..

# బయోమెట్రిక్‌తో ₹5 వేల వరకు పేమెంట్స్

**ఎలా యాక్టివేట్ చేసుకోవాలంటే?**

**ఈ ఫీచర్ ఉపయోగించాలంటే తొలుత బీమ్ యూపీఐ యాప్‌ను ఓపెన్ చేయాలి. ఆపై ప్రొఫైల్‌లోకి వెళ్లాలి. లింకు చేయాల్సిన బ్యాంకు అకౌంట్‌ను ఎంపిక చేసుకోవాలి. అందులో బయోమెట్రిక్ ట్రాన్సాక్షన్ ఆప్షన్‌ను యాక్టివ్ చేసుకోవాలి. ఇప్పుడు ఫింగర్ ప్రింట్ లేదా ఫేస్ రికగ్నిషన్ ఐడీని ధ్రువీకరించాలి. ఆపై రూ.5వేల వరకు లావాదేవీలు చేసుకోవచ్చు.**




రోజు వారీ డిజిటల్ పేమెంట్స్ మరింత సులభతరం కానున్నాయి. యూపీఐ పేమెంట్స్‌లో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (NPCI) కొత్త వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ప్రతిసారీ 4 లేదా 6 అంకెల పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేకుండా బయోమెట్రిక్ సాయంతో డిజిటల్ చెల్లింపులు చేసే సదుపాయాన్ని తీసుకొచ్చింది. అంటే ఫేస్ రికగ్నిషన్ లేదా ఫింగర్ ప్రింట్ సాయంతో రూ.5 వేల వరకు లావాదేవీలు చేసే సదుపాయాన్ని ఎన్‌పీసీఐకి చెందిన డిజిటల్ పేమెంట్ యాప్ BHIMలో అందుబాటులోకి తెచ్చింది.బయోమెట్రిక్, ఫేస్ రికగ్నిషన్ సదుపాయం కలిగిన ఆండ్రాయిడ్, ఐఓఎస్ స్మార్ట్‌ఫోన్లలో ఈ ఫీచర్ పనిచేస్తుందని బీమ్ యాప్ పేర్కొంది. దీనివల్ల రోజువారీ లావాదేవీలు మరింత సులువుగా, వేగవంతంగా జరుగుతాయని తెలిపింది. పేమెంట్స్‌లో బయోమెట్రిక్ డేటా ఫోన్‌లోనే ఎన్‌క్రిప్షన్ రూపంలో ఉంటుందని తెలిపింది. కిరాణా, కూరగాయల దుకాణాలు, చిన్న మొత్తంలో జరిపే ఇతర లావాదేవీలకు ఈ సదుపాయం ఉపయోగపడుతుంది. అయితే, రూ.5వేలు పైబడి చేసే లావాదేవీలకు మాత్రం పిన్ ఎంటర్ చేయాల్సి ఉంటుంది.

## గ్యాస్ కొరతకు చెక్..

## 20 శాతం పెరిగిన కేటాయింపు!



భారతదేశంలో వాణిజ్య ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు లభ్యతను మరింత బలపరచడానికి ముఖ్యమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడించింది. ఇందులో భాగంగానే.. దేశవ్యాప్తంగా కమర్షియల్ LPG సరఫరాను పెంచే నిర్ణయం తీసుకుంది.ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. అదనంగా 20% కమర్షియల్ LPG సిలిండర్ల కేటాయింపును ఆమోదించింది.

దీంతో మొత్తం కేటాయింపు సగటు నెలవారీ అవసరంలో 50%కి పెరిగింది. ఈ పెంపు వలన వాణిజ్య రంగాలకు గ్యాస్ సరఫరా మరింత స్థిరంగా, సమృద్ధిగా అందుబాటులో ఉంటుంది. ఇకపై హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సేవలు వంటి రంగాలు గ్యాస్ కొరత నుంచి విముక్తి పొందే అవకాశం ఉంటుంది. కాగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ గ్యాస్ సిలిండర్లను సమయానికి, సులభంగా అందేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నిర్ణయం వల్ల వ్యాపార సంస్థలు తమ కార్యకలాపాలను అంతరాయం లేకుండా కొనసాగించగలుగుతాయి. అంతేకాకుండా, వినియోగదారులకు ఆహారం, ఇతర సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చేస్తుంది. గ్యాస్ కొరత కారణంగా ఎదురయ్యే సమస్యలు తగ్గుతాయి. ధరల స్థిరత్వం కూడా

### బరువు తగ్గించే ఔషధాలపై కేంద్రం నియంత్రణ



మధుమేహం, ఊబకాయం తగ్గించే ఔషధాల విక్రయాలపై కేంద్రం దృష్టి సారించింది. ఇటీవల పేటెంట్ గడువు ముగియడంతో మధుమేహం, బరువు తగ్గించేందుకు వినియోగించే జీఎల్‌పీ -1 సెమాగ్లుటైడ్ జనరిక్ ఔషధాలను (weight loss drugs) పలు కంపెనీలు విరివిగా దేశీయ మార్కెట్లోకి విడుదల చేశాయి. ఇవి రిటైల్ ఫార్మసీలు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, టోకు వ్యాపారులు, వెల్‌నెస్ క్లినిక్‌ల ద్వారా సులభంగా లభించడంపై ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో అనధికారిక అమ్మకాలపై డ్రగ్స్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా (CDSCO) నియంత్రణ చేపట్టింది. ఈ క్రమంలోనే ఈ ఔషధాల వినియోగం ప్రచారంపై నిషేధం విధించింది.

బరువు తగ్గించే ఈ ఔషధాలను సరైన వైద్య పర్యవేక్షణ లేకుండా ఉపయోగిస్తే తీవ్రమైన దుష్ప్రభావాలు ఎదురవుతాయని, ఆరోగ్య ప్రమాదాలకు దారితీయొచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా క్లినిక్‌లు, ఆన్‌లైన్‌ఫార్మసీ గిడ్డంగులు సహా 49 సంస్థల్లో డ్రగ్స్ కంట్రోల్ నియంత్రణ ఆథారిటీ అధికారులు తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన కొన్ని కంపెనీలకు నోటీసులు జారీ చేసింది. వైద్యుడి సలహా మేరకే జీఎల్పీ-1 డ్రగ్స్ అమ్మకాలు జరపాలని కేంద్రం స్పష్టం చేసింది.

## ట్రంప్ పోస్ట్ కు నిమిషాల ముందు..

# చమురుపై రూ.5400కోట్ల మిస్టరీ ట్రేడింగ్..! కొత్త ధరలు ఇవే!



ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలు, విద్యుత్ కేంద్రాలపై దాడులను వాయిదా వేస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగానే.. అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పతనమయ్యాయి. అయితే, ఈ ప్రకటనకు కొన్ని నిమిషాల ముందు చమురు మార్కెట్ల (Oil Markets)లో ఏకంగా రూ.5,400కోట్ల విలువైన ట్రేడింగ్ జరగడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ అసాధారణ చర్య (Oil Trading) యాదృచ్ఛికమా? లేదా ఇన్‌సైడర్ ట్రేడింగే దీనికి కారణమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**నిమిషంలోనే వేల ట్రేడర్లు..**

న్యూయార్క్ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 6:49 నుంచి 6:50 గంటల మధ్య బ్రెంట్ క్రూడ్, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడ్‌తో సంబంధం ఉన్న దాదాపు 6,200 ఫ్యూచర్ కాంట్రాక్టులు ట్రేడ్ అయ్యాయి. చమురు ధరలు తగ్గుతాయి, స్టాక్ మార్కెట్లు పెరుగుతాయని ట్రేడర్లు ఈ కాంట్రాక్టులతో బెట్టింగ్ చేశారు. వీటి విలువ దాదాపు 580 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.5,400కోట్లు) ఉంటుందని బ్లూమ్‌బెర్గ్ డేటా వెల్లడించింది. ఆ సమయంలో ఎస్అండ్‌పీ 500 సూచీకి సంబంధించి ఫ్యూచర్స్ కూడా పెరిగాయి. ఈ ట్రేడింగ్ జరిగిన 15 నిమిషాల తర్వాత అంటే ఉదయం 7:04 గంటల సమయంలో.. ఇరాన్‌పై దాడులను వాయిదా వేస్తూ ట్రంప్ (Donald Trump) పోస్ట్ చేశారు. ఆ వెంటనే ఇంధన మార్కెట్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఫలితంగా చమురు ధరలు భారీగా తగ్గాయి. అటు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే అవకాశం ఉందన్న అంచనాలతో అమెరికా, ఐరోపాల్లోని ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడ్ అయ్యాయి.

### 'టైమింగ్'పై చర్చ..

భౌగోళిక రాజకీయ అనిశ్చితులపై ప్రకటనలు వెలువడొచ్చన్న అంచనాలతో ట్రేడర్లు ఇలా భారీఎత్తున బెట్టింగ్‌లు చేయడం సహజమే. అయితే, ఎలాంటి సంకేతాలు లేనప్పుడు జరిగిన ఈ ట్రేడింగ్ పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రధాన ఆర్థిక గణాంకాలు, పాలసీ ప్రకటనలు లేని రోజున ఈ స్థాయిలో ట్రేడింగ్ జరగడం చర్చకు దారితీసింది. అంతేకాదు.. దీనివెనక ఒకే సంస్థ ఉందా? లేక ఎక్కువమంది ట్రేడింగ్‌కు పాల్పడ్డారా? అన్నదానిపై కూడా స్పష్టత లేదు. దీనికి 'ఇన్‌సైడర్ ట్రేడింగ్' (రహస్య సమాచారాన్ని ముందుగానే తెలుసుకొని సొంత ప్రయోజనాల కోసం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో చట్టవిరుద్ధ ట్రేడింగ్‌కు పాల్పడటం) కారణమై ఉంటుందా? అనే సందేహాలు బలంగా వినిపిస్తున్నాయి. అయితే, ఇప్పటివరకు అందుకు ఎలాంటి ఆధారాలు లేవని సమాచారం.



## చిన్నప్పుడు ఆ సమస్యకు థెరపీ తీసుకొన్నా: సమీరా రెడ్డి



ఏ విషయం గురించైనా మాట్లాడుతూ ప్రశంసలు అందుకుంటుంటారు నటి సమీరా రెడ్డి (Sameera Reddy). తాజాగా ఆమె తన చిన్నతనంలో ఎదుర్కొన్న వేధింపుల గురించి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడారు. ముఖ్యంగా నత్తి (stammering) కారణంగా తాను ఎదుర్కొన్న అవమానాలు తన ఆత్మవిశ్వాసాన్ని ఎలా దెబ్బతీశాయో వివరించారు.

"నేను చిన్నప్పుడు నత్తి సమస్యతో పెరిగాను. దానివల్ల చాలా వేధింపులకు గురయ్యాను. ఆత్మవిశ్వాసాన్ని తిరిగి పొందేందుకు నాకు ఎన్నో ఏళ్లపాటు థెరపీ అవసరమైంది. ఇప్పటికీ నేను మాట్లాడేటప్పుడు తడబడితే, ఎవరైనా వింతగా చూస్తే అది నన్ను ఎంతగానో బాధ పెడుతుంది. చిన్నప్పుడు మనపై వేసే ముద్ర మన మనసులో ఎంత బలంగా నాటుకుపోతాయో చెప్పడానికి ఇదే నిదర్శనం. పిల్లలను మనం పిలిచే విధానం కూడా వారిపై ప్రభావం చూపుతుంది. వారిపై వేసే చిన్నపాటి ముద్రలు కూడా వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. తాము వెనకబడినవాళ్లమని పదేపదే వినడం వల్ల పిల్లలు కొత్త విషయాలను నేర్చుకోవడానికి భయపడతారు. ఆ అపనమ్మకం వారి వ్యక్తిత్వాన్ని మారుస్తుంది. చివరికీ తాము ఏం చేయలేమనే భావనకు వచ్చేస్తారు. ఇది వారి భవిష్యత్తును ఎంతో ప్రభావితం చేస్తుంది" అని సమీర అన్నారు.

"ఒక్క విషయంలో వెనకబడి ఉన్నంతమాత్రాన అది మన వ్యక్తిత్వాన్ని నిర్ణయించదని నేను నా పిల్లలకు చెబుతుంటాను. పిల్లలకు ప్రోత్సాహం, మద్దతు లభించినప్పుడు వారిలో సహజంగానే పట్టుదల పెరుగుతుంది. విమర్శలకు బదులుగా మద్దతును అందించినప్పుడే వారు సవాళ్లను నేర్చుకోవడానికి ఒక అవకాశంగా చూస్తారు" అని సమీర వివరించారు.



## సందీప్‌రెడ్డి వంగాతో సినిమా? .. రాజశేఖర్ సమాధానమిదీ..!

హీరో రాజశేఖర్ ప్రస్తుతం ఇతర కథానాయకుల చిత్రాల్లో కీలక పాత్రలు పోషిస్తున్న సంగతి తెలిసిందే. అలా ఆయన నటించిన తాజా చిత్రం 'బైకర్' (Biker). శర్వానంద్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమాలో ఆయనకు తండ్రిగా నటించారు. ఏప్రిల్ 3న మూవీ రిలీజ్ కానున్న సందర్భంగా రాజశేఖర్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. దర్శకుడు సందీప్‌రెడ్డి వంగాతో సినిమా గురించి మనసులో మాట బయటపెట్టారు.

గతంలో సందీప్‌తో కలిసి దిగిన ఫొటో ప్రస్తావన రాగా.. ''ఓ రోజు మా ఇంట్లోనే కలిశాం. నేను నటించిన 'శేషు', 'ఓంకారం' సినిమాల స్ఫూర్తితో 'అర్జున్‌రెడ్డి' స్టోరీ రాశానని ఆయన చెప్పారు. ఈసారి కలిసినప్పుడు నాతో సినిమా ఎప్పుడు చేస్తారని అడగాలి. అయినా ఆయన.. పాత్రకు తగ్గట్లే నటులను ఎంపిక చేస్తుంటారు. ఆయన మనసులోకి నేను ఇంకా రాలేదనుకుంటా'' అని నవ్వుతూ అన్నారు.

తన పాత్రలకు ముందు నుంచీ నటుడు సాయి కుమారే డబ్బింగ్ చెబుతున్నారని, 'బైకర్'లోనూ ఆయనే గాత్రదానం చేశారని రాజశేఖర్ తెలిపారు. వ్యక్తిగత జీవితం గురించి చెబుతూ.. తమ పూర్వీకులు తెలుగువారేనని, తల్లిదండ్రులు మాత్రం తమిళనాడుకు వలస వెళ్లినట్లు చెప్పారు. యాక్టర్ అయ్యాక కూడా డాక్టర్‌గా కొన్నాళ్లు ప్రాక్టీస్ చేశానన్నారు. ఇండియన్ ఫస్ట్ మోటోక్రాస్ ఫిల్మ్ 'బైకర్'. ఇందులో శర్వానంద్ బైక్ రేసర్‌గా నటించారు. మాళవికా నాయర్ హీరోయిన్. అభిలాష్‌రెడ్డి దర్శకుడు

## 18 ఏళ్లకే తల్లి పాత్ర.. 'ధురంధర్' నటిపై ప్రశంసలు

సాధారణంగా హీరోయిన్లు ఎక్కువగా గ్లామర్ పాత్రలే చేస్తుంటారు. నటనకు స్కోప్ ఉండే పాత్రలు రేర్‌గా వస్తుంటాయి. అలా వచ్చినప్పుడే కొంతమంది తమ టాలెంట్‌ని నిరూపించుకుంటారు. అయితే అందులోనూ తమ వయసు తగ్గ పాత్రలనే ఎంచుకుంటారు. ముఖ్యంగా తల్లి పాత్రలు చేయాల్సి వస్తే సీనియర్ హీరోయిన్లు సైతం ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారు. 30 ఏళ్లు దాటినా.. తల్లి పాత్ర చేయమని అడిగితే నో చెప్పే హీరోయిన్లు చాలామందే ఉన్నారు. కానీ సారా అర్జున్ మాత్రం 18 ఏళ్లకే తల్లి పాత్ర చేసింది. అది కూడా 40 ఏళ్ల వయసు ఉన్న హీరో నటించిన పాన్ ఇండియా సినిమాలో. అదే ధురంధర్ 2.

ధురంధర్ సినిమా సమయంలో సారాపై పెద్ద ఎత్తున ట్రోల్ నడిచింది. 40 ఏళ్ల వయసు ఉన్న హీరో(రణ్‌వీర్ సింగ్)తో రొమాన్స్ చేయబోతుందంటూ ఆమెను విమర్శిస్తూ పోస్టులు పెట్టారు. కానీ ధురంధర్ రిలీజ్ తర్వాత అందరూ ఆమెపై ప్రశంసలు కురిపించారు. చిన్న పిల్ల అయినా బాగా నటించిందని అభినందించారు.అయితే పార్ట్ 1లో కేవలం హీరో ప్రియురాలి పాత్రలో కనిపించిన సారా.. పార్ట్ 2 మాత్రం ఓ బిడ్డకు తల్లిగా నటించి, మెప్పించింది. ప్రస్తుతం సారా వయసు 20 ఏళ్లు. ధురంధర్ షూటింగ్ సమయంలో ఆమె వయసు 18 ఏళ్లు మాత్రమే. అంత చిన్న వయసులో తల్లి పాత్ర ఒప్పుకొని సారా పెద్ద సాహసమే చేసింది.కథపై నమ్మకంతోనే సారా ఆ పాత్ర చేసేందుకు అంగీకరించిందట. తల్లి పాత్ర ఉంటుందని చెప్పగానే ఏమాత్రం సంకోచించకుండా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందట. ఈ విషయాన్ని ధురంధర్ సినిమా కాస్టింగ్ డైరెక్టర్ ముకేష్ చబ్రా చెప్పారు.'పార్ట్ 2లో తల్లి పాత్ర పోషిస్తున్నానా అనే విషయాన్ని కూడా సారా అడగలేదు. కథ విని వెంటనే ఓకే చెప్పింది. దీంతో ఆమెకు లుక్ టెస్ట్ చేశాం. నేను చేసిన లుక్ టెస్ట్‌లోనూ సారానే ది బెస్ట్ అనిపించింది. అందుకే ఆ పాత్రకు ఎంపిక చేశాం' అని ముకేష్ అన్నారు. కాగా, ధురంధర్ కాస్టింగ్‌పై అంతా ప్రశంసలు కురిపిస్తున్నారు. సినిమాలోని ప్రతి పాత్రకు సరైన నటుడిని ఎంచుకున్నారని, తెరపై చూస్తుంటే వారు తప్ప వేరే నటుడు అలా చేయరేమో అన్నట్లుగా పాత్రలను తీర్చిదిద్దారంటూ సినిమా చూసినవాళ్లు చెబుతున్నారు.




## సీఎం చంద్రబాబుతో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ భేటీ

**ఏపీలో సినిమా షూటింగ్‌లు, ఫిలిం ప్రొడక్షన్ అంశాలపై చర్చ**



బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధికి సంబంధించి ఇద్దరి మధ్య చర్చ జరిగింది. రాష్ట్రంలో సినిమా రంగానికి సంబంధించి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్టు సంజయ్ దత్ ముఖ్యమంత్రికి వివరించారు. సినిమా షూటింగ్‌లకు ఏపీని కేంద్రంగా చేయాలన్న ప్రభుత్వ ఆలోచనలు, ఉన్న అవకాశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఫిలిం స్టూడియోలు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ పరంగా ప్రణాళికలు ఉన్నామని సంజయ్ దత్‌కు ముఖ్యమంత్రి వివరించారు. తద్వారా సినిమా, వినోద రంగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కలిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ముఖ్యమంత్రి సంజయ్ దత్‌ను కోరారు.

## ధురంధర్' చుట్టూ వివాదం.. 'తప్పుదోవ పట్టిస్తున్నారు' అంటూ మాధవన్ వివరణ



దీనిపై నటుడు మాధవన్ వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ''ధురంధర్' కుటుంబం తరఫున అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నా. మీరు చూపిస్తున్న ప్రేమ, ఆదరణ మర్చిపోలేనిది. దీనిని ఎలా వ్యక్తపరచాలో అర్థం కావటంలేదు. తాజాగా ఓ సన్నివేశానికి సంబంధించి కొంతమంది మనోభావాలు దెబ్బతిన్నట్లు నా దృష్టికి వచ్చింది. ముఖ్యంగా దశమ్ గ్రంథ్‌లోని గురు గోవింద్ సింగ్‌జీ శ్లోకం వచ్చినప్పుడు నేను సిగరెట్ కాలుస్తూ కనిపించానని అంటున్నారు. అందులో ఎలాంటి నిజం లేదు. ఇది పూర్తిగా తప్పు దోవ పట్టించే విషయం. సినిమా మేకింగ్ విషయంలో దర్శకుడు ఆదిత్యధర్ ఎంతో స్పష్టంగా ఉన్నారు''

ఒకవైపు 'ధురంధర్' బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తుంటే, మరోవైపు ఏదో ఒక రకంగా వివాదాలు చుట్టుముడుతున్నాయి. తాజాగా ఓ సన్నివేశంలో అజయ్ సన్యాల్ పాత్ర వ్యవహరించిన తీరుపై వివాదం నెలకొంది. ఆర్.మాధవన్ (R. Madhavan) ఈ పాత్రలో కనిపించిన సంగతి తెలిసిందే. 'దశమ్ గ్రంథ్'లోని ఓ శ్లోకాన్ని పఠిస్తున్నప్పుడు ధూమపానం చేస్తున్నట్లు ఉందని కొందరు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టుల పెట్టడంతో ఈ వివాదం నెలకొంది. దీనిపై మహారాష్ట్రలోని శివసేన సిక్కు విభాగ అధ్యక్షుడు గుర్‌జ్యోత్ సింగ్ ఖీర్ ములంద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నటులు మాధవన్, రణ్‌వీర్ సింగ్, దర్శకుడు ఆదిత్యధర్‌లపై కేసు నమోదైంది. ''ఆ సన్నివేశం తెరకెక్కించేటప్పుడు దశమ్ గ్రంథ్‌లోని శ్లోకం చెప్పటానికి ముందే సిగరెట్ కాల్చడం ఆపేయాలని అన్నారు. అలాగే చేశాం. నా నోటి నుంచి కూడా ఎలాంటి పొగా రాలేదు. మీరు కావాలంటే మరోసారి తెరపై చూడొచ్చు. నా చేతిలోనూ సిగరెట్ ఉండదు. ఎందుకంటే ఆ వచనాలు ఎంతో పవిత్రమైనవని మా అందరికీ తెలుసు. ఆ సన్నివేశం ముగిసే వరకూ ఎక్కడా సిగరెట్ ఆనవాళ్లు కనిపించవు. ఒకరి మనోభావాలు దెబ్బ తీసేలా మేము ఎందుకు సన్నివేశాలు తీస్తాం. సిక్కు వర్గానికి మేము ఎప్పుడూ అండగా నిలబడి ఉంటాం. వారి పట్ల మాకు అపారమైన గౌరవం ఉంది. నేను గోల్డెన్ టెంపుల్‌ను కూడా దర్శించుకున్నా. అది అందరికీ తెలుసు. మాకు ఎవరినీ బాధించాలన్న ఉద్దేశం లేదు. ఒకవేళ అలా జరిగిందని ఎవరైనా భావిస్తే, క్షమించండి. సంతోషంగా ఉండండి. 'ధురంధర్2'ను థియేటర్స్‌లో చూసి ఆస్వాదించండి''అని మాధవన్ అన్నారు.

## కోసింది కోయగూర గంప.. జానపద పాట రిలీజ్



**తెలుగమ్మాయి ఆనంది ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం గరివిడి లక్ష్మి. గౌరీ నాయుడు దర్శకత్వం వహిస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలో బుర్రకథలతో ఫేమస్ అయిన గరివిడి లక్ష్మి జీవిత కథ ఆధారంగా ఈ మూవీ తెరకెక్కుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన నల జీలకర్ర మొగ్గ బాగా వైరలయింది. తాజాగా మరో జానపద పాటను వదిలారు.**

ఉత్తరాంధ్ర జానపదం
కోసింది కోయగూర దుబ్బో సందమామ.. వాసనకీ సంపంగి మొగ్గ అంటూ పాట మొదలవుతుంది. ఈ జానపద పాటలో ఆనంది మాస్ స్టెప్పులు వేసింది. చరణ్ అర్జున్ సంగీతం అందించగా అనన్య భట్, షకలక శంకర్, గౌరీ నాయుడు జమ్ము ఆలపించారు. ఈ పాటను ఉత్తరాంధ్ర జానపదాల నుంచి సేకరించినట్లు చిత్రయూనిట్ వెల్లడించింది.

**ఆనంది కెరీర్**

ఆనంది విషయానికి వస్తే.. తెలంగాణలోని వరంగల్ జిల్లా తన స్వస్థలం. ఆమె అసలు పేరు రక్షిత. సినిమాల్లోకి వచ్చాక తన పేరును హాసికగా మార్చుకుంది. అది కలిసిరాకపోయేసరికి ఆనందిగా మారింది. తెలుగులో జాంబిరెడ్డి, ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం, శ్రీదేవి సోడా సెంటర్, ప్రేమంటే, భైరవం సినిమాలు చేసింది. తెలుగులోకన్నా కోలీవుడ్‌లోనే హీరోయిన్‌గా మంచి పేరు, అవకాశాలు తెచ్చుకుంది.

## నా 'పయనం' అలా మొదలవుతుందనుకున్నా కానీ: సత్యదేవ్



స్వీయ దర్శకత్వంలో కెన్ కరునాస్ హీరోగా నటించిన సినిమా 'యూత్' (Youth Movie). ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరోలు శ్రీవిష్ణు, సత్యదేవ్, దర్శకులు సాయి రాజేశ్, హసిత్ గోలి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై, సందడి చేశారు. వీరి పాత ఫొటోలను వేదికపై ప్రదర్శించి.. అవి ఎప్పుడు దిగారో తెలుసుకునే ప్రయత్నం చేశారు యాంకర్. తాను 'పయనం' అనే సినిమా కోసం విశాఖపట్నంలో స్టిల్స్ తీసుకున్నానని సత్యదేవ్ (Satyadev) తెలిపారు. ఆ మూవీతోనే నటుడిగా తన పయనం ప్రారంభమవుతుందని అనుకున్నానని, కానీ ఫొటోలు మాత్రం మిగిలాయి అంటూ నవ్వులు

## 'ఉస్తాద్ భగత్ సింగ్'.. ఆ ట్రాక్ కోసమే మహిళలు సినిమాకు వస్తున్నారు: హరీశ్ శంకర్



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కించిన చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' (Ustaad Bhagat Singh). తాజాగా దీని ప్రచారంలో భాగంగా హరీశ్ శంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమాకు వస్తున్న స్పందనపై ఆయన (Harish Shankar) మాట్లాడుతూ.. సెకండ్ హాఫ్‌లో వచ్చే శ్రీలీల ఎపిసోడ్ మహిళా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోందని తెలిపారు. "నిజం చెప్పాలంటే.. రెండో భాగంలో శ్రీలీల (Sreeleela) ట్రాక్ చూడటం కోసమే మహిళలు భారీగా థియేటర్లకు వస్తున్నారు. పవన్ కల్యాణ్‌ను రెండు గంటల పాటు అభిమానులు వారు కోరుకున్నవిధంగా చూసుకోదగ్గ చిత్రమిది. కుటుంబ ప్రేక్షకులందరూ కలిసి ఆస్వాదించేలా ఉంది. నేను ఈ చిత్రం విషయంలో చాలా సంతోషంగా ఉన్నాను'' అని అన్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ మూవీలో పవన్‌కు జోడీగా శ్రీలీల, రాశీఖన్నా నటించగా.. పార్తీబన్ విలన్ పాత్రలో కనిపించారు.

## ఫిజికల్లీ.. టెక్నికల్లీ.. మెంటల్లీ.. ఫిట్‌గా ఉండాలి: రికీ పాంటింగ్



మరికొన్ని రోజుల్లోనే ఐపీఎల్ (IPL) 2026 ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఆయా జట్లు తమ ప్రాక్టీస్‌ను ముమ్మరం చేశాయి. పంజాబ్ కింగ్స్ (Punjab Kings) జట్టు సైతం మెగా లీగ్‌కు సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో పంజాబ్ కింగ్స్ జట్టు హెడ్ కోచ్ రికీ పాంటింగ్ (Ricky Ponting) కీలక వ్యాఖ్యలు చేశాడు. ఆటగాళ్లు తొలి మ్యాచ్ నుంచే ఫిట్‌గా ఉండాలన్నాడు.

'ఇది శిక్షణ. ఇది సన్నద్ధత. మా మొదటి మ్యాచ్ నుంచే మేం ఫిజికల్‌గా, టెక్నికల్‌గా, మెంటల్‌గా ఫిట్‌గా ఉండాలనుకుంటున్నాం. గత ఏడాది మీరు (క్రికెటర్లు) జట్టుకు ఏం అందించారు? దేనివల్ల మనం ఒక మంచి జట్టుగా ఏర్పడ్డాం..? అనే విషయాలను ఒక్కసారి గుర్తుచేసుకోవాలని నేను కోరుకుంటున్నాను' అని రికీ పాంటింగ్ అన్నాడు.

అలాగే ఆటగాళ్లు చేసే పొరపాట్ల గురించి అతడు ప్రస్తావించాడు. క్రికెట్‌లో అవన్నీ సాధారణం అని అన్నాడు. 'మనమందరం పొరపాట్లు చేస్తాం. అందులో తప్పులేదు. ఈ ప్రయాణంలో నేను కూడా తప్పులు చేస్తాను. మీరందరూ తప్పులు చేస్తారు. క్యాచ్‌లు జారవిడుస్తారు. చెత్త షాట్లు ఆడతారు. చెత్త ఓవర్ వేస్తారు. కానీ మీ గేమ్ ప్లాన్‌కు కట్టుబడి ఉన్నంతకాలం, మీరు ఒక తప్పు చేసినా, నా దృష్టిలో అది తప్పు కాదు. క్రికెట్‌లో ఇవన్నీ సహజం. అది ఆటలో ఒక భాగం' అని పాంటింగ్ అన్నాడు.

### కోల్‌కతాలోకి సౌరభ్ దూబె..

## సన్‌రైజర్స్ లోకి డేవిడ్ పేన్




పీఎల్ (IPL) 2026 సీజన్ కోసం కోల్‌కతా నైట్ రైడర్స్ (Kolkata Knight Riders) జట్టులోకి ఆకాశ్ దీప్ స్థానంలో సౌరభ్ దూబె రానున్నాడు. ఆకాశ్ దీప్ నడుము నొప్పితో ఈ సీజన్‌కు దూరమయ్యాడు. అతడు బెంగళూరులోని బీసీసీఐ (BCCI) సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో వైద్య బృందం పర్యవేక్షణలో పునరావాసం పొందనున్నాడు. అతడికి ప్రత్యామ్నాయంగా కోల్‌కతా నైట్ రైడర్స్.. ఎడమచేతి వాటం పేసర్ సౌరభ్ దూబెను జట్టులోకి తీసుకోనుంది. అతడికి రూ.30 లక్షలను చెల్లించనుంది.

గాయం కారణంగా జాక్ ఎడ్వర్డ్స్.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు (Sunrisers Hyderabad) దూరమయ్యాడు. అతడి స్థానంలో ఇంగ్లాండ్ ఆటగాడు డేవిడ్ పేన్ జట్టులోకి రానున్నాడు. అతడికి హైదరాబాద్ జట్టు రూ.1.5 కోట్లు చెల్లించనుంది. శ్రీలంక క్రికెటర్ దాసుక శనక సైతం రాజస్థాన్ రాయల్స్ (Rajasthan Royals) జట్టులోకి రానున్నాడు. అతడికి రూ.75 లక్షలు చెల్లించే అవకాశముంది.

## నేను మంగూస్ బ్యాట్ ఎవరికిస్తానంటే..: మాథ్యూ హెడెన్



ఐపీఎల్ (IPL) 2026 ప్రారంభానికి ముందు గుజరాత్ టైటాన్స్ (Gujarat Titans) బ్యాటింగ్ కోచ్ మాథ్యూ హెడెన్ (Matthew Hayden) ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. మంగూస్ బ్యాట్‌తో గుజరాత్ టైటాన్స్ జట్టు ఫినిషర్.. రాహుల్ తెవాతియా రాణిస్తాడని హెడెన్ అన్నాడు.

'నేను నా మంగూస్ బ్యాట్‌ను ఒకవేళ గుజరాత్ టైటాన్స్ జట్టులో ఎవరికైనా ఇవ్వాల్సి వస్తే.. నేను దాన్ని రాహుల్ తెవాతియాకు అప్పగిస్తాను. అతడిలో ఆ శక్తి ఉంది. తెవాతియా ఆ బ్యాట్‌తో రాణిస్తాడు. టీ20 క్రికెట్‌లో అయిదు, పది పరుగులే కీలకం. దీంతో మ్యాచ్ ఆరంభం, ముగింపులో దూకుడుగా రన్స్ రాబట్టడం అవసరం' అని హెడెన్ అన్నాడు.

గత నాలుగు సీజన్లలో రాహుల్ తెవాతియా లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేశాడు. అతడు 43 ఇన్నింగ్స్‌ల్లో 150కి పైగా స్ట్రైక్‌రేట్‌తో 591 పరుగులు చేశాడు. హెడెన్ 2010లో దిల్లీ డేర్ డెవిల్స్‌కు ఆడే సమయంలో మంగూస్ బ్యాట్‌తో ఆడి 43 బంతుల్లోనే తొమ్మిది ఫోర్లు, ఏడు సిక్స్‌ల సాయంతో 93 పరుగులు సాధించిన విషయం తెలిసిందే.

# నిరంతర యజ్ఞంలా సీఎం కప్




**–క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తాం..తెలంగాణ మట్టిలో మాణిక్యాలను గుర్తిస్తాం**

**–సీఎం కప్ రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకల్లో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

తెలంగాణ మట్టి లోని మాణిక్యాల క్రీడా ప్రతిభను సానపెట్టేందుకే సీఎం కపూర్ పోటీ నిర్వహించామని ఇది ఒక నిరంతర కార్యక్రమంలో గా కొనసాగిస్తామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈరోజు ఎల్బీ ఇండోర్ స్టేడియంలోరెండవ విడత సీఎం కప్ పోటీల ముగింపు ఉత్సవాలు రాష్ట్ర స్థాయి వివరాలు ఛాంపియన్షిప్ టీమ్లకు ట్రోఫీల బహుకరణ జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న మట్టిలో మాణిక్యాలను గుర్తించేందుకే రెండు విడతలుగా సీఎం క పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఒక నిరంతర ప్రక్రియ లాగా దీనిని ప్రతి సంవత్సరం కొనసాగిస్తామని తెలిపారు.క్రీడల్లో విజయం సాధించాలంటే కేవలం ప్రభుత్వ ప్రోత్సాహం మాత్రమే క్రీడాకారులకు కృషి పట్టుదల ఉండాలని అప్పుడు మాత్రమే క్రీడాకారులు చాంపియన్లుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు.

యువ క్రీడాకారులకు సైనా నెహ్వాల్ వంటి క్రీడాకారుల జీవితం స్ఫూర్తి కావాలని ఆయన అన్నారు.సీఎం క పోటీలో పాల్గొన్న క్రీడాకారుల ప్రతించి వారికిస్పోర్ట్స్ స్కూల్లో అకాడమీ లలో అవసరమైతే ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు.స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ క్రీడా ప్రతిభ గుర్తింపు కొరకే సీఎం కప్ పోటీలు ర్వహిస్తున్నామని, ఇది నిరంతరం జరిగే ప్రక్రియ లాగా ముందుకు వెళ్తామని తెలిపారు.క్రమశిక్షణ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు, ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం కప్ పోటీల విజయవంతంలో క్రీడా సంఘాల భాగస్వామ్యం ఎంతో ఉందని, ఎన్నో ప్రభుత్వ శాఖలు విభాగాలు సహకారం వల్లనే పోటీలు విజయవంతంగా కొనసాగాయని తెలిపారు.మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ, సీఎం క పోటీలలో దాదాపు 5 లక్షల 40 వేల మంది క్రీడాకారులు ఆన్లైన్లో నమోదు చేసుకోగా, వారి సంపూర్ణ సమాచారాన్ని క్రీడా అవసరాలకు అనుగుణంగా క్రోడీకరిస్తున్నామని తెలిపారు.

--ఓవరాల్ ఛాంపియన్ గా అదిలాబాద్

గ్రామీణ మండల అసెంబ్లీ జిల్లా రాష్ట్రస్థాయి ఐదుఅంచల్లో కొనసాగిన ఈ పోటీల్లో అది ఉమ్మడి అదిలాబాద్ జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలబడగా, రెండో స్థానంలో రంగారెడ్డి జిల్లా మూడో స్థానంలో కరీంనగర్ జిల్లా నిలిచాయి.విజేతలకు మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి సైనా నెహ్వాల్ సోని బాలాదేవిలు ట్రోఫీలు అందజేశారు. సీఎం కప్ పోటీల విజయవంతంకి కృషిచేసిన వివిధ ప్రభుత్వ ప్రైవేటు సంస్థలకు స్పోర్ట్స్ అథారిటీ ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికలను బహూకరించింది.ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల డివైఎస్ఓ లు, క్రీడా సంఘాల ప్రతినిధులు స్పోర్ట్స్ అథారిటీ కోచులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రతి మ్యాచ్‌లో 11 సీట్లు రిజర్వ్..

# ఆర్సీబీ కీలక నిర్ణయం



2026లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో (Sunrisers Hyderabad) చిన్నస్వామి స్టేడియం వేదికగా జరగబోయే మొదటి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (Royal Challengers Bengaluru) ఆటగాళ్లు 11వ నంబర్ జెర్సీలు ధరించనున్నారు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ సీఈఓ రాజేశ్ మేనన్ మంగళవారం వెల్లడించాడు. గత సంవత్సరం ఆర్సీబీ విజయోత్సవ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వారికి నివాళిగా ఆర్సీబీ ఈ నిర్ణయం తీసుకోనుంది. అలాగే స్టేడియంలో 11 సీట్లను వారికి గుర్తుగా రిజర్వ్ చేసి పెట్టనున్నట్లు సమాచారం. అంతర్జాతీయ మ్యాచ్‌లతో సహా, ఈ వేదికపై జరిగే అన్ని కార్యక్రమాల సమయంలో ఆ సీట్లు ఇకపై ఖాళీగా ఉంటాయని తెలుస్తోంది. శనివారం.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగబోయే మ్యాచ్‌కు ముందు స్టేడియం లోపల ప్రవేశ ద్వారం దగ్గర ఒక స్మారక ఫలకాన్ని సైతం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ సీజన్‌లో ఆర్సీబీ గ్రూప్ స్టేజిలో చిన్నస్వామి స్టేడియంలో అయిదు, రాయ్‌పూర్‌లో రెండు మ్యాచ్‌లు ఆడనున్న విషయం తెలిసిందే.

### ఆర్సీబీకి కొత్త యజమాని.. ఎంతకు కొన్నారంటే?

**ఐపీఎల్ 2026 ముంగిట డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) ఫ్రాంఛైజీ చేతులు మారింది. రూ.16,706 కోట్లకు ఆర్సీబీని ఆదిత్యబిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ కొనుగోలు చేశాయి. బ్రిటీష్ డిస్టిలరీస్, యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ (USL) మాతృసంస్థ అయిన డియాజియో కంపెనీ మొన్నటివరకు ఆర్సీబీకి యజమానిగా ఉంది. 2008లో ఐపీఎల్ ఆరంభ సమయంలో యూబీ గ్రూపు అధినేత విజయ్ మాల్యా బెంగళూరు ఫ్రాంచైజీని దక్కించుకున్నాడు. అనంతరం మాల్యా అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో భారత్‌లోని తన అనుబంధ సంస్థ యునైటెడ్ స్పిరిట్స్ ద్వారా బెంగళూరు ఫ్రాంచైజీని డియాజియో కొనుగోలు చేసింది. తాజాగా డియాజియో బెంగళూరు ఫ్రాంచైజీని ఆదిత్యబిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్‌నకు విక్రయించింది. ఐపీఎల్ 2026 మార్చి 28 నుంచి మొదలుకానున్న సంగతి తెలిసిందే. తొలి మ్యాచ్‌లో ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి.**

## చేతులు మారిన రాజస్థాన్ రాయల్స్.. రూ.15 వేల కోట్లకు విక్రయం..!



ఐపీఎల్ 2026 సీజన్ మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో భారీ డీల్ కుదిరినట్లు కనిపిస్తోంది. రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ (Rajasthan Royals)ని అమెరికా వ్యాపారవేత్త కల్ సోమానీ నేతృత్వంలోని కన్సార్టియం కొనుగోలు చేసినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. 1.63 బిలియన్ డాలర్ల (రూ.15 వేల కోట్లు)తో ఈ ఫ్రాంచైజీని దక్కించుకున్నట్లు సమాచారం. దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

ఇప్పటికే ఇరువర్గాల మధ్య ఒప్పందంపై సంతకాలు జరిగాయని, 2026 ఐపీఎల్ సీజన్ (IPL) తర్వాత కొత్త యజమానులకు ఈ ఫ్రాంచైజీ అప్పగించనున్నారని తెలుస్తోంది. ఈ సోమానీ.. ఇంట్రాఎడ్జ్, ట్రుయిమో, ట్రుయిమో.ఏఐ, అకాడెమియన్ సంస్థల వ్యవస్థాపకుడు. ఇక కన్సార్టియంలో అమెరికా వ్యాపారవేత్త రాబ్ వాల్టన్ కూడా ఉన్నారు. ప్రముఖ రిటైల్ సంస్థ వాల్‌మార్ట్‌కు ఆయన ఛైర్మన్‌గా వ్యవహరించారు. అగ్రరాజ్యానికే చెందిన మరో వ్యాపార కుటుంబం హాంప్ ఫ్యామిలీ కూడా ఈ గ్రూప్‌లో భాగం.

కాగా.. ఫ్రాంచైజీలను అమ్మాలని రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కొంతకాలం క్రితం నిర్ణయం తీసుకున్నాయి. అయితే కొలంబియా పసిఫిక్ క్యాపిటల్స్ పార్టనర్స్ (సీపీసీపీ) కన్సార్టియం నుంచి రూ.16వేల కోట్ల ఆఫర్ వచ్చినా.. రాజస్థాన్ తిరస్కరించిందని ఇటీవల మీడియా కథనాలు వచ్చాయి. ఈ ఫ్రాంచైజీలో ఎమెర్జింగ్ మీడియా వెంచర్స్ అధినేత మనోజ్ బదాలె వాటా 65 శాతం కాగా.. రెడ్‌బర్డ్ క్యాపిటల్‌కు మిగతా వాటా ఉంది.